# కవితా కౌముది - 2007



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 123

# విషయ సూచిక

(చిత్రాలు: దెందుకూరి రఘునాథ్)


| ఏడాది | నెల | కవిత | కవి / కవయిత్రి | పేజి |
|---|---|---|---|---|
| 2007 | 01 | ఒంటరిగా నువ్వొక్కడివే | కిరణ్ ప్రభ | 4 |
| | | సంక్రాంతి తీపి గురుతులు | మొటమఱ్ఱి సారధి | 5 |
| | | యుటోపియా – మానవుడు | లైలా ఎర్నేని | 7 |
| | | తెలుసుకో | తటవర్తి జ్ఞాన ప్రసూన | 9 |
| | | | | |
| 2007 | 02 | నేనూ – వాడూ ..! | కిరణ్ ప్రభ | 12 |
| | | బంగారు తల్లి | నిషిగంధ | 14 |
| | | స్వంతం | ముకుంద రామారావు | 15 |
| | | సూర్య కమలం | పెమ్మరాజు వేణుగోపాలరావు | 16 |
| | | | | |
| 2007 | 03 | విదూషకుడి మారు వేషం..! | కిరణ్ ప్రభ | 19 |
| | | ఏమిటీ పరిస్థితి? | ప్రశు | 20 |
| | | పతనం | గంధం సువర్ణ రాణి | 21 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 22 |
| | | ఉగాది ... ఉగాది | మొటమఱ్ఱి సారధి | 23 |
| | | అమ్మ | దెందుకూరి రఘునాథ్ | 24 |
| | | | | |
| 2007 | 04 | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 27 |
| | | మనసా ఎందుకిలా? | అరుణకాంతి | 28 |
| | | సాధారణం – అసాధారణం | కిరణ్ ప్రభ | 29 |

| | | | | |
|---|---|---|---|---|
| | | కొత్త మనిషి | పెరుగు రామకృష్ణ | 30 |
| | | అద్దెకి అమ్మరికం | స్వర్ణలత | 32 |
| | | కాంక్రీటు చెట్టు | ఈత కోట సుబ్బారావు | 33 |
| | | | | |
| 2007 | 05 | గాలి గాయపడిన వేళ | పలమనేరు బాలాజీ | 35 |
| | | అమ్మను విసుకున్న పిమ్మట... | వంజువాక సతీష్ కుమార్ రెడ్డి | 36 |
| | | నా పాటలు | వైదేహి శశిధర్ | 37 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 38 |
| | | | | |
| 2007 | 06 | ప్రవాహం | యోగానంద్ | 39 |
| | | కాగితం పడవలు | నచకి | 40 |
| | | పువ్వులు | చెరుకూరి రమాదేవి | 42 |
| | | పునరపి | సాయి బ్రహ్మనందం గొర్తి | 43 |
| | | కార్డియాలజిస్ట్ | గోపాల్ నేమాన | 44 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 46 |
| | | | | |
| 2007 | 07 | హత్య చేయబడిన ఆత్మ | నిశాపతి | 47 |
| | | మాట కచేరి | ఏటూరి నాగేంద్రరావు | 48 |
| | | నడక నేర్చుకో | రామా చంద్రమౌళి | 49 |
| | | ప్రియా! | కుమార్ కలగర | 50 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 52 |
| | | | | |
| 2007 | 08 | భయకంపం | ఎమ్వీ రామిరెడ్డి | 53 |
| | | రేవు బావురుమంటోంది | నిశాపతి | 55 |
| | | వడిసెల రాళ్ళూ | జ్వలిత | 56 |

| | | | | |
|---|---|---|---|---|
| | | హై "క్లూ" లు | తరిగొప్పుల వి ఎల్లెన్ మూర్తి | 58 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 59 |
| | | | | |
| 2007 | 9 | ప్రియతమా! | ఉమ చింతలపాటి | 60 |
| | | ది హాఫ్ బ్లెస్సెడ్ | టి వెంకటేష్ | 61 |
| | | వెంటాడే పిలుపు | మూలా సుబ్రహ్మణ్యం | 63 |
| | | ఆమె | యోగానంద్ | 63 |
| | | ఒంటరి రహస్యం | నిషిగంధ | 65 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 66 |
| | | | | |
| 2007 | 10 | అద్యులేటరీ  నుంచి అడల్టరీ  దాకా! | కె ఎ మునిసురేష్ పిళ్ళై | 67 |
| | | చివరి కోరిక | కాలనాధభట్ట వీరభద్ర శాస్త్రి | 69 |
| | | లోకా సమస్తా సుఖినోభవంతు | ఆచాళ్ళ శ్రీనివాసరావు | 70 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 71 |
| | | | | |
| 2007 | 11 | ఇక్కడో దీపం అక్కడో దీపం | శైలజా మిత్ర | 73 |
| | | నీవు నవ్వితే | సహ్యాజ | 76 |
| | | హిమ తారక | ఝాన్సీలక్ష్మి కొత్త | 77 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 78 |
| | | | | |
| 2007 | 12 | ముద్ర | నాదెళ్ళ అనురాధ | 79 |
| | | స్నేహార్ద్రం | శ్రీ రాం కుమార్ భాగవతుల | 80 |
| | | వెన్నెలా రావా ఇలా | సావి | 81 |
| | | వెన్నెల వెతలు | చంద్రహాస్ | 82 |
| | | రసరేఖలు | బచ్చోటి శ్రీధర రావు | 82 |

# ఒంటరిగా నువ్వొక్కడివే ..!

- కిరణ్‌ప్రభ



సముద్రఘోషలో  కొత్తలోకాల సందేశాలు  విందామని
నావికుడవై పయనిస్తుంటావు..
అనుకోకుండా కెరటాలు ముంచెత్తుతాయి,
నువ్వొక్కడివే ద్వీపంలో ఒంటరిగా!!
ఎడారి ఇసుక సంతకాల్లో కొత్తచిత్రాలు చూద్దామని
నిరంతర పథికుడవై అడుగులేస్తుంటావు..
హఠాత్తుగా లేచిన సుడిగాలి సూదులు గుచ్చుతుంది
నువ్వొక్కడివే  ఎడారిలో ఒంటరిగా!!

ఒక నెమలి నాట్యంకోసమో, అడవిపూల అందంకోసమో
చీకటి కీకారణ్యం నడుమ నిల్చుంటావు..
ఊహించని జడివాన నిను ముంచేస్తుంది
నువ్వొక్కడివే చీకటి లోకంలో ఒంటరిగా!!
ఏ పరిస్థితులనైనా, ఎన్ని అవాంతరాలెదురైనా.. నిజంగా నువ్వు ఒంటరివేనా?
నిన్ను నువ్వు నమ్ముకున్నప్పుడు
నీ గుండెబలం నీకు తోడైనప్పుడు
నువ్వెప్పుడూ ఒంటరివి కాదు..
నువ్వొక్కడివైనా నువ్వే.. నువ్వొక యోధుడివి,
నువ్వొక శూరుడివి, నువ్వొక సైన్యానివి.!
నిరంతర సంచారీ..నీకు నువ్వే ఒక దిక్సూచి!!

## సంక్రాంతి తీపి గురుతులు

- మొటమర్తి సారథి, సిడ్నీ



సంబరాల సంక్రాంతి
మూడు రోజుల ముచ్చటలు
గుర్తున్నాయా.. మీకు గుర్తున్నాయా?
కాలప్రవాహంలో కలిసిపోయాయా?

అలనాడు.. చిన్ననాడు
సంక్రాంతి వస్తున్నదంటే..
ధనుర్మాస నెలరోజుల ముస్తానం
ఎంత సంబరం.. ఎంత ఆనందం.



ముద్దబంతులతో గొబ్బిళ్ళు
బొమ్మల కొలువులతో ఇళ్ళు
పొంగలి ప్రసాదాలతో నోళ్ళు...
అలరారించిన రోజులు –

తెల్లవారకే బుడబుక్కల వాళ్ళు
తెల్లవారితే డూడూ బసవన్నలూ..
ఇస్తే మెచ్చి, కాకుంటే నొచ్చి
పరిహాసాలు పంచిన రోజులు –

ఆలోచించి మెరుగులు దిద్దిన ముగ్గులు
కళాపి చల్లి అందిరికి చూపాలని
సాయం సంధ్యకై ఉత్సుకతో
వేచి చూచిన రోజులు –

తిరిగి తిరిగి పోటీపడి
ఆవుపేడ పోగుచేసి
భోగి పిడకలు ఎండగట్టి
నాదే పెద్ద దండని మురిసిన రోజులు
–

సారధి గారు ఆస్ట్రేలియా లోని ఐ.బి.ఎమ్ కంపెనీలో ఉన్నతోద్యోగం చేస్తున్నారు. సిడ్నీ తెలుగు అసోసియేషన్ సెక్రటరీ గా వున్నారు. తెలుగు సాహిత్యమన్నా, నాటకాలు వేయడమన్నా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలన్నా ఆసక్తి.

సర్పిపుల్లలు, తాటిమానులు
పెద్దవాళ్ళు వద్దంటున్నా
ఏర్చికూర్చిన భోగిమంటలు
మాదే పెద్ద మంటని గర్వించిన రోజులు –

కట్టుపొంగలి, చక్రపొంగలి, దద్దోజనాలు
బొబ్బట్లు, పులిహోర, గారెలు, ఆవడలు
అందరికీ పంచి, తినిపించి
మావే బాగున్నాయనిపించిన రోజులు -

మరల మరల రావేమని తలపోస్తుంటే
గతస్మృతుల మేఘాలు వర్షించాయి -
భోగిమంటని మదిలో రగిలించాయి
మెరుపు కాంతిలో సంక్రాంతి చూపించాయి!!

## యుటోపియా - మానవుడు

- లైలా ఎర్నేని.



అదె చూడు!

అల పుడమిలో,
ఆ దూర తీరాలలో
ఓ కడలి పొంగుల నేల ఉన్నది.
పూలరేకుల సోకుల
పాలరెక్కల పక్షి కేకల
పరవశించెడి నేల ఉన్నది.

పోరాటములు లేవు, పదవీ
పటాటోపములు లేవు, వేదన

ప్రకటనములు వినరావు. సదా
మాధుర్యసీమ అది చూడగ!



అదిగో! ఆ మలకలనే, ఆ దాపునె
మెత్తని తీవెలు, మత్తుల పూవులు
ఒత్తుగ అల్లిన ఓ వర్ణ కుటీరమున్నది
ఆ సుందర వాటిక నాది సుమా!
అందు నేనుందునో మానవా!

వీటి తలుపెప్పుడు బారుగ తీసి యుండు
పాటలేవో, తేటి తెలుగులేవో వినబడు. చూడ
గాఢములు, గూఢములు నా వర్ణచిత్రములు
కఠినములు జటిలములు నా పఠనములు
వగరు తీపి ద్రాక్షలు నాప్రణయ కాంక్షలు
ఆ రమణీయ సురవాటికలో లేవెట్టి ఆంక్షలు.

నేనో! కల్లా కపటము లెరగను
ఉల్లాసభరితమౌ సల్లాపములు సేతు
ఊగాడు నా మనసు ఆనందడోలల.
అల్లారుముద్దుగ ఎల్లరి ప్రేమల
ఓలలాడుదు నేనా కుటీరమున, ఆ సీమల.

చోటులేదు సుమా! ఆ ప్రాంగణమున,
నా కుసుమ సమాన మానసమున;
రోషమునకు, కావేషమునకు, కోపాల
విషమునకు, దుఃఖాల కషాయమునకు.

అట్టి తావు నీకు ప్రియము కాదేని

దాటిపొమ్మా వీటిని; ఒక్కటేని
మోటు మాటాడుకుము, క్షణమేని
చేటు తలపకుము. ఈసు
కాటు వేయకుమో మానవా!
ఆ దైవలబ్ధిత, హరిత పత్రాచ్ఛాదిత
వరవీణా రాగభరిత, సురసుతవాసమున.

వీడిపోవుము మానవా! ఆచోటును
బాట అదిగో, ఎదురుగనున్నది;
దాటిపోవుము, జాప్యమేటికి,
చీకటి పడకముందె మౌనముగ
నా వీటిని దాటిపోవుము

## తెలుసుకో

– తటవర్తి జ్ఞానప్రసూన



గాటినో దారిలో కారు మెల్లగాజారుతోంది
గుమ్ముగా నీలి కానుగలు
కొమ్మలు జాచిన ఈపదాలలో
నెమ్మది రమ్ము నెచ్చెలీ
'ఇచ్చట ఈవును నేనును తప్ప
వేరెవరు లేరు' అన్న
విశ్వనాధవారి పద్యం
గుర్తుకు వచ్చింది..
ఇక్కడ ఫర్ పైన్ చెట్లకి
సదా వసంతమే ..!

మేపుల్ చెట్లు అన్నీ పొడుగ్గా ఎదిగి
మీకంటే మేమే ఎత్తు
అంటున్నాయి..
ఫాల్ వచ్చిందంటే
ఫ్యామిలీ ఫోటోలా ఉంటుంది
మూడు తరాలతో..
ఆకుపచ్చగా కొన్నిచెట్లు
ఆకు రంగు మారుతూ కొన్ని చెట్లు ..
అయిష్టంగా
ఆకు రాలుస్తున్న
నడి వయసు చెట్లు
ఒక పక్క పండిన
ఆకులతో
ఉదాసీనంగా ఉన్నా ,
సంధివయసు చెట్లు
ఆకు పచ్చ పసుపు పచ్చ
నారింజ ముదురెరుపు..!

నేరేడుపండు రంగు
మామిడిచిగురు రంగు
ఒకదాన్ని అందాన్ని
ఒకటి పెంచుతూ
గుంపుగా నిలబడి
కదంబమాలలా కనబడే
అందమైన చెట్ల గుంపు..
కారు దిగి నడుస్తుంటే
ప్రకృతి మన గురువు
అనిపించింది.

ఒక నిండు రంగుల కాన్వాస్,
కంటికి విందు చేసే
రంగు రంగుల గాజుల మలారం..
ఈపువ్వులిలా ఊడిపోతేకానీ
ప్రకృతి విప్పి చెపుతున్నది
బుర్రకెక్కని వేదాంతాన్ని
వయసు పరిమితం తెలియని
మానవ జీవిత నశ్వరత్వాన్ని
చిత్రంలా చూపిస్తోంది..!
ఇలా పుట్టి ఇలా పెరిగి
ఇలా పూసి ఇలాకాసి
ఇలా పండి ఇలా రాలి
మోడువవుతావు మానవా అని..!
అయినా నమ్మలేని
నిజం ఒప్పుకోలేని
పాపం మానవుడు
నున్నగా జారిపోయే
గులకరాళ్ళ మీద నిలబడి
ఆగలేక ఆపుకోలేక
వెళుతున్నాడు వెళుతున్నాడు..
ప్లీజ్ నిలబడవా?
ఒక్కసారి ప్రకృతి
సందేశం వినవా!

జ్ఞాన ప్రసూనగారు
తెలుగులో బి.ఏ చేసారు.
కథలూ, కవితలూ వ్రాస్తారు
హిందీ నుంచీ, ఇంగ్లీష్
నుంచీ అనువాదాలు
కూడా చేస్తారు..
వీరికి సాహిత్యమంటే
విపరీతమైన అభిమానం.

# నేనూ-వాడూ..!

-కిరణ్‌ప్రభ



వేకువ గుమ్మంలో నిలుచున్నప్పుడు
ప్రకృతి చైతన్య గానాన్ని
వింటుంటాను నేను-
పగలు చెయ్యాల్సిన పనులు
గుర్తుచేస్తుంటాడు వాడు..!

కొండ కొమ్మున చేరి కిందికి చూస్తున్నప్పుడు
లోయల సౌందర్యానికి

అబ్బురపడుతుంటాను నేను-
అగాధాల లోతుని బేరీజు వేసి
భయపెడుతుంటాడు వాడు..!

మునిమాపులో గోధూళివేళ
గూటికి చేరే పక్షుల కువకువ రాగాల్ని
విని పరవశిస్తుంటాను నేను-
కమ్ముకొచ్చే చీకటిని
భూతద్దంలో చూపెడతాడు వాడు..!

వెన్నెల పుచ్చ పువ్వులా పరుచుకున్నప్పుడు
శీతల కిరణాల కొలనులో
మునకలేస్తుంటాను నేను -
తరుముకొస్తున్న కారుమేఘాన్ని చూపించి
హెచ్చరిస్తుంటాడు వాడు..!

జీవన చదరంగలోని
తెలుపు నలుపుల వైచిత్రిని
ఆసక్తితో గమనిస్తుంటాను నేను -
తరువాత వెయ్యాల్సిన ఎత్తుగురించి
తొందర చేస్తుంటాడు వాడు..!

భావుకతకు రెక్కలు తొడిగి రసరాజ్యాలను చేరాలని నేను..
ఊహలకు సంకెళ్ళు వేసి వాస్తవంలోకి లాగాలని వాడు..!

# బంగారు తల్లి!!

-నిషిగంధ

ఒడిలో నా ప్రపంచం
ఆదమరచి నిద్రపోతోంది..

తన గుప్పెట్లో
బిగుసుకున్న నా వేలు..
ఆలంబన అవసరం
నాదేనన్నట్లు!!

నా పసితనపు
ఘడియల్ని మళ్ళీ చూపిస్తున్న
బుల్లిపాదాలు..
స్పృశించకుండా ఉండటం
నాతరమేనా!?

ఏమనిపించిందో
నిద్రలో నిండుగా నవ్వింది..
గదిలో తెల్ల గులాబీలు
విరబూసాయి!!





విజయవాడలో పుట్టి పెరిగిన నిషిగంధ గత 8 సంవత్సరాలుగా మయామి ఫ్లోరిడా లో ఉంటున్నారు. పుస్తక పఠనం, పాటలు వినడం, స్నేహితులతో కబుర్లుచెప్పడం వీరి అభిరుచులు. మనసును కదిలించిన భావాలను కవితల రూపంలో వ్యక్తపరచటం వీరి అలవాటు .



## స్వంతం

-ముకుంద రామారావు



దిగువున ఉన్నాం
రోజూ నీళ్ళొస్తాయి
ఉన్న నీటిని ఒంపేయి
మళ్ళీ పూర్తిగా నింపు
బట్టలన్ని ఉతుకు
అన్నింటినీ శుభ్రం చేయి
మొక్కలన్నింటికీ పోయి
కుండీలన్నీ నింపు
డాబా బాగా తడుపు
ఇంకా వస్తుంటే ఆపేయకు
ఆగేవరకూ వాకిలంతా తడవనీ
ఒక్క నీటిచుక్కని కూడా ఎటూ పోనీయకు



హెచ్.పి. కంపెనీలో సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఇటీవలే రిటైరయ్యారు. తెలుగులో అద్భుతమైన కవితలు వ్రాస్తున్న రామారావు గారు ఇంతవరకూ మూడు కవితా సంకలనాలను ప్రచురించారు.

# సూర్య కమలం

- పెమ్మరాజు వేణుగోపాలరావు

మా యింట నందనోద్యాన వనంలో
ఎదురు చూస్తూ ఉంటుంది నిత్యం
సూర్య కమలం ఒకటి
సూర్య కిరణాల కోసం.
ప్రొద్దు చూస్తూ తిరిగే పువ్వు
ప్రొద్దు తిరుగుడు పువ్వు
ముద్దుగా మేము పెంచిన మొక్క
ధరణికి ఆభరణ కమలం.
ఎదురు చూస్తూ కూర్చుంటుంది
ఆఖరి కాంతికిరణం తనమీద పడి
తనలో ఐక్యమయ్యే వరకూ.



ప్రతి కాంతి కిరణం తన ఘోష చెప్పుకుని
తన ఒడిలో సేద దీర్చుకుంటూ
విశ్రాంతి తీసుకుంటూంటే సృష్టికి తను చేస్తున్న
సహకారం తలుచుకుంటూ
సంతృప్తితో గర్వపడుతుంది.

ఎర్రని కాంతి కిరణం ఒకటి ఆవేశంతో ఒగర్చుకుంటూ
ఆయాసపడుతూ వచ్చి
గుక్క తిప్పుకోకుండా చెప్పిన మాటలు.

నేను మామూలు కాంతి కణాన్ని కాదు
సూర్య మండల గర్భకుహరంలో
జన్మించిన సూక్ష్మ కణాన్ని
మిలియను సంవత్సరాలు పట్టిందా
అగ్ని గోళపుటంచులు చేరటానికి.
దారి పొడుగునా గండాలే

నన్నటు తిప్పి ఇటు తిప్పి రకరకాలుగా సాగదీసి
నానా అవస్థలు పెట్టిన వివిధ పదార్థ కణాలు
ప్రోటానులు, న్యూట్రానులు, న్యూట్రినోలు, ఎలక్ట్రానులు
చెప్పలేనన్ని భూతాలు
అయస్కాంత క్షేత్రాలలో
సుడి గుండాలలో తిరుగుతూ
రకరకాల విద్యుత్కణాలు
నన్ను మింగి నమిలి విసిరి పారేశాయి.
బయటపడి స్వేచ్ఛగా హాయిగా పరుగెడుతూ
ప్రవహిస్తున్నాననే సంతృప్తి క్షణం మాత్రమే.
పేరు లేదు చిరునామా లేదు
కనివిని ఎరుగని అగాధం
గురుత్వాకర్షణ శక్తితో
అన్నిటిని ఆరగించే అహోబిల క్షేత్రం
సరిహద్దుల్లో చిక్కుపడి
హతమారిపోతానేమోనని
భయపడిపోయాను.
దీనంగా పలికింది కణం.

గర్వంతో పలికింది సూర్యకమలం
మా సూర్య మండలంలో
అగాధాలు లేవు, అన్యాయాలు జరగవు.

నేను పుట్టిన సూర్యమండలం
విన్న వించుకుంది కాంతి కిరణం
మీ స్వంతపరగణా కాదు
మరొక ప్రపంచపు సరిహద్దుల్లో
మరొక మార్తాండ మండలం
దారిలో చెప్పుకుంటున్నారు
ఈ విశ్వాంతరాళంలో

లక్షలు, మిలియన్లు , కోట్లు, బిలియన్లు
ఎన్నో సూర్య మండలాలున్నాయట
మీ ఊళ్ళో భౌతిక శాస్త్రజ్ఞులే
కనిపెట్టారీ అద్భుత విశేషం.

తను పుట్టిపెరిగిన భూప్రపంచమే
విజ్ఞానానికి పునాది వేసిందని
తనని పెంచిన మానవుడి మేధస్సే
విశ్వమంతా వెలుగుతోందనీ
సంతృప్తిచెంది తలవంచింది

ఆఖరి స్వర్ణకిరణం
సూర్యకమలంలో కరిగి పోయింది.



పెమ్మరాజు వేణుగోపాలరావుగారు ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా తిరుపతిపురంలో పుట్టారు. వీరి విద్యాభ్యాసం ఏలూరు, వాల్తేరు, యూజీన్ (ఒరిగన్) లలో జరిగింది. భౌతికశాస్త్రంలో డాక్టరేటు. ప్రస్తుతం ఎమరీ విశ్వవిద్యాలయంలో అణుశాస్త్ర పరిశోధనలో అధ్యాపకులు. చిత్ర, కవిత్వ నాటక కళలలో ఉత్సాహం, ప్రవేశం, అనుభవం కలవారు. సతీమణి స్వరాజ్యమహాలక్ష్మి, కుమార్తెలు నళిని, సలీనా.

## విదూషకుడి మారు వేషం..!

కిరణ్‌ప్రభ

ఛాయాచిత్రంలో,

సూర్యాస్తమయం కూడా సూర్యోదయంలానే కనిపిస్తుంది-

ఉదయపుటెండలోనే కాదు,

సూర్యుడు జారిపోయేటప్పుడుకూడా నీడలు పొడవుగానే ఉంటాయి-

చేపపిల్లలు అమాయకంగా తుళ్ళుతున్నంత సేపూ,

కొంగలు బుద్ధిగా జపం చేసుకుంటున్నట్లే అగుపిస్తాయి-

నిజ రూపం తెలీనంత కాలం,

కాకి కోకిలగానే భ్రమింపచేస్తుంది-



వాగ్దానాల్ని మత్తు మందుగా మార్చగలిగినన్నిరోజులూ

విదూషకుడూ నాయకుడిగానే చెలామణి ఔతాడు..!

కానీ- కనిపెట్టే కాలమే నిజం చెబుతుంది..

వడపోతలో మిగిలేదే చరిత్రలో నిలుస్తుంది.!

# ఏమిటీ పరిస్థితి?

- ప్రశు, జెర్మనీ

చుట్టూ మంచు
చిమ్మ చీకటి
రోజూ చూసే రహదారులు
ఎండమావులకే పోటీ



అటు ఒక అడుగు
ఇటు ఇంకొకటి
వెళ్ళి వచ్చే రోడ్డు
కళ్ళు తెరవదేమిటి?

దూరంగా ఇల్లు
నాది కాదేంటి?
అడ్డంలా బండ రోడ్డు
అబద్ధాలు విసురుతుందేమిటి?

ఈ దేశం నన్ను వళ్ళో చేర్చుకోదేమి?
సవితి పోరు కథలు,
ఎన్నటికి ఆగవేమి?
వసుధైక కుటుంబానికి సాక్ష్యులేరి?



ప్రశాంత్ గారు పి.హెచ్.డీ స్టూడెంట్‌గా Max Planck Institute of Economics, Jena, Germanyలో ఉంటున్నారు. ఇంగ్లీష్, తెలుగు కవితలు రాయడం వీరి అభిరుచి.



# పతనం

-గంధం సువర్ణరాణి , ఐ.ఎ.ఎస్

ఎందుకిలా?

సున్నితమైన మనసు

సుతిమెత్తని మనసు

పూలగాలి లాంటి మనసు

దూది పింజలాంటి మనసు

వెన్నలాంటి మనసు

వెన్నెల లాంటి మనసు

మెలమెల్లగా

కరకు లోకపు సుత్తిదెబ్బలతో

రాయిరప్ప అయిపోయింది.

ఉక్కు ముక్క అయిపోతోంది

ఇనుపదిమ్మె అయిపోతోంది

చూద్దును కదా!

నీ మనసే కాదు, ప్రతిమనమూ అలాగే

ప్రతిమనిషీ అలాగే

ఉక్కు మనసుతో, రాతిగుండెతో

మరమనిషిలా!





ఐ.ఎ.ఎస్ కేడర్‌లో పలు పదవులు నిర్వహించిన శ్రీమతి సువర్ణరాణి గారు, ప్రస్తుతం Oikocredit అనే అంతర్జాతీయ సంస్థకి ఆసియా ఖండానికి ఇన్-చార్జి గా పనిచేస్తున్నారు. చిన్నప్పటినుంచీ కవితలంటే ప్రాణం. మనస్సు-మేధస్సు అనే స్వీయ కవితా సంపుటాన్ని కూడా వెలువరించారు.



# రసరేఖలు

బచ్చోటి శ్రీధరరావు

అఖిలరూపుని దివ్యపాదార్చ కొరకు
కన్ను విప్పిన రెండు మొగ్గలము మనము
అప్సరాంగనల్ కురిపించునలరులట్లు
కురియు వానలో రెండు చిన్కులము మనము

పూలపాపల నిద్దురబుచ్చుటకును
కొమ్మనూయలగట్టునాకులము మనము
వెన్నెలల రేవెలుంగుకు విందు చేయు
కలువ పూవుల విచ్చు రేకులము మనము



అనిల బాలకు గంధమ్మునలదు నట్టి
నూత్న కుసుమ పరాగ రేణువుల మనము
భ్రమర బాలునకై పూల పాత్రలందు
చవులు గూర్చు రెండమృతబిందువుల మనము

సంజవేళలో పశ్చిమాశాంచలమున
కాంతులెగబోయు మబ్బుతున్కలము మనము
సాంధ్య రాగమ్ములో నాకసమ్మునందు
కలిసి తిరుగాడు రెండు గువ్వలము మనము

వర్ష ఋతువున నాకాశ పరిధి వెలయు

నవ్య విష్ణుధనువున వర్ణముల మనము

అనవరతమును విడువక మనలజూచు

ప్రకృతి నిర్మాత కంటి పాపలము మనము



బచ్చోటి శ్రీధర రావు గారు  ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, బెంగుళూరు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పి.హెచ్.డి. ముగించి, పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ తో అమెరికాకి రావడం జరిగింది. తెలుగు సాహిత్యమన్నా, నాటికలలో నటించడమన్నా ఇంకా అభిమానమే. భార్య కనకదుర్గ, పిల్లలు సమీర, ప్రవీణ్ లతో కలిసి జర్మన్ టౌన్, మేరీలాండులో నివసిస్తున్నారు



## ఉగాది ... ఉగాది

సారథి మొటమఱ్ఱి, సిడ్నీ

అవే కోరికలు... అవే ఆశలు...

మొలకెత్తిస్తూ.. రేకెత్తిస్తూ..

వేవేల సంవత్సరాలు -

కాలగర్భంలో కలిసిపోయాయి.

మంచి గతంలో కాసింతేనని

చరిత్ర చెబుతుంటే..

రేపు రుచిగా ఉంటుందా -

రేపటికి నేడు గతమవుతుంటే?

బుద్ధులెందరో వచ్చినా -

బుద్ధిలేని మనిషి బుద్ధికి..

వసంతాలెన్ని వచ్చినా -

వసంతంలేని మానవతకి...

ఉగాది కనిపించేనా?

యుగాదిగా మారేనా?

అవధులు దాటిన -

వేదన అంత మయ్యేనా?



సారధిగారు ఆస్ట్రేలియాలోని ఐ.బి.ఎమ్ కంపెనీలో ఉన్నతోద్యోగం చేస్తున్నారు. సిడ్నీ తెలుగు అసోసియేషన్ సెక్రటరీగా ఉన్నారు. తెలుగు సాహిత్యమన్నా, నాటకాలు వేయడమన్నా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలన్నా ఆసక్తి.



## అమ్మ

దెందుకూరి రఘునాథ్



అందరికీ అమ్మంటే ప్రేమ.. భక్తి..

నాకు కూడా...

కానీ దాంతోపాటు నాకు అమ్మంటే జాలి.

ఆకాలంలో నువ్వు పుట్టగానే..

అమ్మో అమ్మాయా అని అన్నారు..

ఊహ కూడా రాకుండానే.. ఓ కుర్రాణ్ణి చూపించి

వీడే నీ మొగుడన్నారు..

అమ్మ ప్రేమతో కొద్దిగా రుచి చూసేలోపే..
అత్తగారి రుస రుసలు సాధింపులు.
ఆడదానికి ఆడదే శత్రువన్నది నిజంచేస్తూ
ఆడపడుచు పెట్టే నసలూ తప్పలేదు.

పతిసేవయే మాధవసేవగా..
ఇంటెడు చాకిరీ నీతో చేయించారు..
నువ్వేంటో నీకు తెలిసే లోపల
నిన్నో తల్లిని చేశారు..

భూమాతలా ఎన్నో మాసాలూ మోసావు..
గోమాతలా నిలిచావు
పిల్లల్ని కనే యంత్రంగా మారావు...
ప్రత్యక్షదైవానికి సతీ సావిత్రివయ్యావు..

ఇంటిల్లిపాదికి సేవ చేస్తూ..
గుణవంతురాలైన అత్తకి ఉత్తమురాలిన కోడలివయ్యావు.
కుటుంబాన్ని కంటూ ఓ అర్ధాన్ని కలిపించావు..
కొవ్వొత్తిలా నువ్వు కాలుతూనే ఇంటిల్లిపాదికీ వెలుగునిచ్చావు..
పిల్లలకు గురువై పాఠాలు చెప్పావు..

నువ్వు అత్తగా మారే సమయానికి కోడళ్ళ యుగాలొచ్చినా..
కోడళ్ళలో కూతుర్ని చూసి క్షమిస్తూనే ఉన్నావు..
అక్కడ నువ్వే బానిసయ్యావు...
అమెరికా కొచ్చి నీ మనవడికి నీవే ఆయా అయ్యావు

చిన్నప్పుడు నాడు పెద్దయ్యాక నేడు
నీ సంతానం నీ గుండెల మీద తన్నినా
తన్నులని భరిస్తూనే.. నీ పెదాల మీద
చిరునవ్వు చెరక్కుండా అలాగే ఉన్నావు

ఇప్పటికి మరి ఎప్పటికి అమ్మ అనే
పదానికి తిరుగులేని అర్ధానిచ్చావు..
ఏమి చేసి నీ రుణం తీర్చుకోము..

అందుకే అమ్మా..
నువ్వంటే నాకు ఎనలేని ప్రేమ.. భక్తి ..
అన్నిటితో పాటు జాలి..



వరంగల్‌లో పుట్టి పెరిగిన రఘునాథ్ ప్రస్తుతం సిలికాన్ వేలీలోని సిస్కో సిస్టమ్స్‌లో పనిచేస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లలతో మిలిపిటాస్‌లో నివాసం. పెయింటింగ్స్, కార్టూన్స్ వేయడం, సంగీతం హాబీలు. వయొలిన్ నేర్చుకుంటున్నారు.





# రసరేఖలు

బచ్చోటి శ్రీధరరావు

లేతమబ్బువు నీవు మల్లికవు నీవు
తేనెసోనవు నీవు చంద్రికవు నీవు
పూల పరిమళమీవు పుప్పొడివి నీవు
ప్రకృతి సౌందర్యమీవు సర్వమ్ము నీవు



కలవసంత మవీవు కోయిలవు నీవు
శుకము పల్కులవీవు శారికవు నీవు
భ్రమరబాలవు నీవు పుష్పమ్ము నీవు
ప్రణయరాగము నీవు నా ప్రాణమీవు

నిండు హాసము నీవు కన్నీరు నీవు
అతులితానంద ఝరి నీవు వెతవు నీవు
జ్వలిత కోపాగ్నిశిఖవీవు శాంతమీవు
నాల్గు విధముల జను నా మనస్సు నీవు

## మనసా ఎందుకిలా?

అరుణకాంతి



మనసా!
ఆనందంలో ఆహ్లాదంగా ఉంటావు
ఆవేదనలో ఆరాటపడతావు
క్షణానికి ఒకలా మారుతుంటావు
ఏల అందరిలో ఒక్కలా ఉండవు?
నీవెందుకున్నావు? మేము మనుష్యులమైనందునా
రాగద్వేషాలేల? ఇది నీకు ఆటనా
మౌనతరంగాలతో నీ గొంతులోగిలి మూసినా
కన్నీటి రుచి మరిగి ఆలోచనా ప్రయాణం ఆపునా?
అవధులు లేని ఊహా ప్రపంచాన విహరించుట
మానునా!?
ఆనందపుటంచులలో ఉయ్యాలలూగిన కాని
ఆవేదనలన్నీ మోసుకొచ్చిన కానీ
కనుల వాకిలిముందే ఉంచాలి కానీ
గొంతు ప్రవాహానికి అడ్డుగా నిలువవెందుకని?
స్వార్థపు ఊబికి లాగకు, నన్ను నన్నుగా బ్రతకనీ!
నిన్ను పట్టిన మాలిన్యాలు వదిలించుకో వేదనంతా
అనుభవాలుగా మార్చుకో, అభిమానంగా మలచుకో
ప్రేమ ఒక్కటే జీవితంలో శాశ్వతనిధి అని తెలుసుకో
అదే శాంతి మంత్రమై ప్రణవ నాదాన్ని పలికించుకో
జీవన వేదానికి అర్థం ఇదే అని గ్రహించుకో



ఏ మాలిన్యం అంటని సువాసన వెదజల్లు పువ్వులా
నిండార మునిగినా ఏ మాత్రం తడవని తామరాకులా
ఇసుమంతైనా కల్మషం లేని పసిపాప నవ్వులా
నిన్ను నువ్వు మార్చుకుంటూ ఉండిపో అలా..!

## సాధారణం-అసాధారణం

కిరణ్ప్రభ



ప్రతిరోజూ  వచ్చే ప్రభాతానికి
ఎదురెళ్ళి ఆహ్వానం పలకాల్సిన పని లేదు
చిమ్మచీకట్లో చిరుదీపం వెలిగించాలంటేనే
చిత్తశుద్ధి కావాలి -
తొలకరి చినుకుల పలకరింపుకి
భూమిని చీల్చుకురమ్మని
విత్తనానికి వేరుగా చెప్పాల్సిన అవసరం
లేదు
ఎడారిని నందనవనం చెయ్యాలంటేనే
భగీరథ ప్రయత్నం చేయాలి -
నీటి వాలుగా సాగిపోయే పడవకి
తెరచాపతో పనిలేకపోవచ్చు
ఏటికి ఎదురీదాలంటేనే
గుండెలనిండా దమ్ముండాలి -
వసంతంలో విరితావులకోసం
అన్వేషించాల్సిన పనిలేదు
శిశిరంలో పూల సౌరభాలు  చవిచూడాలంటేనే
సృష్టికి ప్రతిసృష్టి చేసే నేర్పు కావాలి-
కాలంతోపాటు తలవంచుకు నడవడానికి
పెద్ద హంగూ ఆర్భాటం ఉండాల్సిన అగత్యం లేదు..
కాలానికి ఎదురు నిలిచి 'నువ్వు'గా మిగలాలంటేనే -
కాలగతిని మార్చే
కొత్తదారుల పయనించాలి
మొదటి అడుగు నీదై
అందరికీ ముందుండాలి..!

# ఉగాది కవితల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కవిత

## కొత్త మనిషి

పెరుగు రామకృష్ణ - నెల్లూరు



రక్తం రంగు చెప్పనక్కర్లేదు
నువ్వు మనిషి వాసన వేస్తే చాలు..
నీ స్పర్శ నిరంతర పరిచయాల దొంతర
నులి వెచ్చదన మొక్కటే కరువైంది
ఈ నేలకు నిన్ను చిరునామా చేయటం
నీలోని శాంతి సహన పర్వానికి నిదర్శనం..
నీ చిరునామా కోసం నువ్వెత్తుకోవడమంటే
పువ్వు పరిమళాన్ని కోల్పోయిందనే
మట్టివాసన సమసిపోయిందనే
లింగ వివక్షా పరీక్షల్లో నీ ఉనికి నువ్వు కోల్పోయావనే..
పావురం కోసం తొడమాంసాన్ని తూచిన
నీకొండ పిడికెడు గుండెగా మారిపోయిందా?
నీకాలి ధూళి తాకితే రాతి నాతిగా మారే గుణం కరువైందా?
వొక్క పిలుపుకి కోటి పాదాలై కదిలిన నీ నడక
శాంతి యుద్ధానికి శతసహస్ర ప్రాణాలుగా విచ్చుకున్న ఆత్మ
నీలోని పంచభూతాల్లోని జీవలక్షణమే కదా!
జీవలక్షణానికి మరణం ఉండదు, రుణం తప్ప
బతికుండగానే అమ్మను కాటికి మోసినప్పుడే
నీ భుజాల నుంచి కుళ్ళిన శవాల కంపు మొదలైంది..
నీలో మనిషి మరణించిన చావుకేక విన్పించింది..

ప్రపంచాగ్నికి ఆహుతిచ్చిన స్వార్థ సమిధలు నిరర్థకం
పిచ్చిక గూట్లో ఇరుక్కుని రాత్రంతా గోరంత వెలుతురైన
ఒక మిణుగురు కావాలి స్తబ్దాటవిలో పాదయాత్ర కోసం
ఆ మిణుగురు తన ఆరిపోయింది నీలో..
కోట్లాది కన్నుల్లో కన్నీటి తడిని తుడిచిన
కరుణకు మొలచిన ఆ చేయి విరిగిపోయింది నీలో..
వర్షానికి గొడుగు పట్టడం వేరు
ఎండకి నీడగా చెట్టై మొలవడం వేరు
రెండు చేతుల్ని వేయి చేసి నిండు మనసుతో
కౌగిలించుకునే అమ్మతనం ఆరిపోయింది నీలో..
విత్తుగా మొలకెత్తే గుణం చచ్చిపోయింది నీలో ..
నీలో ప్రాణమనే లక్షణం మరణించడానికి ముందే
నేలతల్లి చిరునామా మారిపోవడానికి ముందే
నువ్వు ఫీనిక్స్‌లా అగ్నిస్నానం చేయాలిప్పుడు...,
కొత్త ఆకాశం అక్కర్లేదు, కొత్త రుతువులు అవసరం లేదు
వందేమాతర గీతమై కొత్తమనిషిగా మొలకెత్తాలిప్పుడు!



గత ఆరేళ్ళుగా అనేక కవితా పురస్కారాలనందుకున్న రామకృష్ణగారు నెల్లూరులోని వాణిజ్యపన్నుల శాఖలో పనిచేస్తున్నారు. వెన్నెల జలపాతం, శ్వేత సంతకాలు అనే స్వీయ కవితా సంపుటాల్ని, నువ్వెళ్ళిపోయాక, ఫ్లెమింగో అనే దీర్ఘకవితల్నీ పుస్తకాలుగా వెలువరించారు.

# ఉగాది కవితల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కవిత

## అద్దెకి అమ్మరికం

స్వర్ణలత -వరంగల్




ఇళ్ళకి మాత్రమే వేళ్ళాడే
"అద్దెకివ్వబడును" బోర్డులు
గబ్బిలాలై గర్భసంచీకీ వచ్చేశాయి!

తలతాకట్టుల గతిలోంచి
రక్తవర్తకాలూ, కిడ్నీబేరాలూ దాటి
పరాయీకరణకి పరాకాష్టగా
అమ్మకడుపూ అద్దెకొంపై
అమ్మరికమే కిరాయికొచ్చే
సీజన్ తెచ్చాం -

గోమాత గంగిరెద్దై
గిత్తగా మారి
Bullionకి అమ్ముడైంది -
ఆమె ఇప్పుడు
అమ్మాకాదు బొమ్మాకాదు
ఒక భావరహిత టంకశాల!!

డాక్టర్ స్వర్ణలత గారు వరంగల్ లోని CKM Arts & Science College లో ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్ రీడర్ గా పనిచేస్తున్నారు.



# ఉగాది కవితల పోటీలో తృతీయ బహుమతి పొందిన కవిత

## కాంక్రీటు చెట్టు

ఈతకోట సుబ్బారావు -నెల్లూరు

ఈ నల్లరేగడి పొలంలో
ఎవరో రాతి విత్తులు నాటుతారు
కాంక్రీటు చెట్టొకటి మొలుస్తుంది
ఆకాశమెత్తుకు ఎగరాలనుకొనే పక్షులకి
ఓ గూటి సముదాయం వెలుస్తుంది
గూళ్ళు గూళ్ళైన కొమ్మలు
గూటికో రంగుల పక్షి కాపురం..
కొమ్మకొమ్మకో వలస రాష్ట్రం
సాయంత్రమైతే చాలు
రంగుల కలొకటి నిద్రలేస్తుంది..
ఆడంబరాల నకిలీ హంగులతో
మిథ్యా అంతస్తుల సత్య ప్రదర్శనలతో
ఎవరి భాషలోవారిదో వింత ప్రపంచం..
మూసిన తలపుల వెనక
అవసరాల పరిమళాల ధూపం
ప్రపంచాన్ని దూరంగా తరిమేస్తూ
గోడలు గోడలై విస్తరించిన
ఏకాకుల ఇసుక మేట ..
తెల్లవారిన కిరణం వెలుతుర్లో
రెక్కలు కట్టుకుని పక్షులన్నీ
ఎగిరిపోతాయి జీవితాకాశంలోకి ..
అప్పుడు చెట్టొక స్మశాన నిర్మానుష్యం



మళ్ళీ సాయంత్రమైతేనే
గువ్వలనీ గూటి పంచన చేరతాయి..
అందమైన నాలుగ్గోడల పంజరంలో
అందరూ ఇక్కడ స్వతంత్ర బానిసలే
ప్రసూతి గదిలో పురిటివాసనలా
ప్రతి అపార్టుమెంటూ ఓ కంపార్టుమెంటే
ఆజన్మ పరిచయాలున్నా సరే
చిరునవ్వుల పలకరింపులుండవిక్కడ
మాటల నదులు ప్రవహించవు
మమతల హరివిల్లు విరియదు
ఆత్మీయతల వెన్నెల కురియదు
జైల్లో ఖైదీలైనా కలిసుంటారు కాని
అపార్టుమెంటుల్లో బందీలంతా
ఎవరికి వారు అంటరాని కాకులే..
వాళ్ళ ఆకాశానికి నాలుగు దిక్కులుంటాయి
సీమిత క్రేంద్రంలో సజాతి భిన్న ప్రవాసం
చిత్రం కాదు కాని నగరం
ఒక ఆత్మీయుల బైరాగి మఠం!
అయినా సరే -
నగరంలో ఎక్కడో వొక చోట
హరితశాద్వలాలకి కడుపుకోత విధిస్తూ
రోజుకో కాంక్రీటు చెట్టు
నిరాటంకంగా మొలుస్తూనే ఉంటుంది!

*****

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## గాలి గాయపడిన వేళ

- పలమనేరు బాలాజి



జ్ఞాపకాలు మరణంతో
పునరుజ్జీవింపబడతాయి
మరణం కూడా మనుషులకు
పునరుజ్జీవమే
శరీరంతో సహా అనుభూతులన్నింటికి
అనుబంధాలన్నింటికీ అంత్యక్రియులు జరిపాక
మనుషుల్ని చీకటి కమ్ముకుంటుంది.
దహించిన దాన్నేదో దగ్గర చేసుకోవాలనే
ఆరాటమలాగే ఉంటుంది
దహనం జరిగిన చోటుకి
వెడితే అప్పుడు తెలుస్తుంది కదా
గాలి కూడా గాయపడుతుందని
గాలి కూడా గాయపరుస్తుందని.

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## అమ్మను విసుక్కున్న పిమ్మట...

- వంజవాక సతీష్ కుమార్ రెడ్డి



నాకు నేనే మాడి మసై పోవాలనిపిస్తుంది
ఏదైనా తిరుగులేని దండన విధించుకోవాలనిపిస్తుంది
అమ్మను కసురుకున్న అనంతరం
మనస్సంతా నల్లగా కమిలినట్టవుతుంది
బాధంతా ఊపిరయినట్టుంటుంది
అమ్మను దురుసుగా మాటాడిన పిమ్మట
పెన్నేటికి వరదలొచ్చి ఊళ్ళన్నీ మునిగిపోయినప్పటి బాధ
పొట్టమీద కొచ్చిన వరికంకుల్ని
నవంబరు నెల పొట్టన పెట్టుకున్నప్పటి బాధ
అప్పుడనిపిస్తుంది కదా!
జీవితాద్యంతపు అసహనాన్ని దహించెయ్యాలని, నాలుకను వేనవేల
వ్రయ్యలుగా చీరెయ్యాలని,
నన్ను నేనే సుదూర తీరాలకు విసిరేసుకోవాలని -
కానీ....
విస్తృత శకలంలా,
తిరిగి మలచలేని ఛిద్రకలశంలా,
అద్భుత చిత్తరువుపై ఒలికి పోయిన సిరాలా
అమ్మ హృదయాన్ని గాయపరచిన
నా అనాగరిక ప్రవర్తనా ప్రకటనను
ఎలా తిరిగి తీసుకోగలను?
ఆమె ముఖంలో ముసురుకున్న చీకటిని
ఆమె నొసలు, కణతలను
కంపన, ప్రకంపనాలుగా వణికించే
వ్యథా సంచిత వేదనోద్భవపు చేష్టను
ఉగ్గడించి చూడ్డం తప్ప

## నా పాటలు

- వైదేహి శశిధర్

ఏదో పాడుకుంటూ రాసుకుంటున్న నేను
నా గదిలోకి వంగిన ఆకాశాన్ని చూసి
ఆశ్చర్యపోతాను



తెల్లని మబ్బులు ప్రాణ స్నేహితుల్లా
చల్లగా నా ముంగురులు సవరించినపుడు
దక్షిణపు గాలి విసురుగా నా చెంపల్ని స్పృశించినపుడు
ఆకాశం ఆపేక్షగా వంగి నన్ను పరామర్శించినపుడు
చుక్కలు నన్ను చూసి తళుక్కుమని నవ్వినపుడు
నా స్వప్నాలు గుల్మొహర్ పుష్పాలై వికసిస్తాయి

నా పాటలు రంగు రంగుల పక్షుల్లా మారి
పచ్చని తోటల్ని పచ్చిక మైదానాల్ని
విచ్చిన పూవుల్ని జొన్న కంకుల్నీ
ఎత్తైన కొండల్నీ పారే సెలయేళ్ళనీ
అడవి మల్లెల్నీ తీగ సంపెగల్నీ
వెతుక్కుంటూ రివ్వున ఎగిరిపోతాయి.
నేను మాత్రం ఇలా పాడుకుంటూ రాసుకుంటూ
నా చిన్ని ప్రపంచంలో మిగిలిపోతాను.

# రసరేఖలు

బచ్చోటి శ్రీధరరావు

మన కనులు రెండును కలిసి కొనక మున్ను
మన మనస్సులు ప్రేమాబ్ధి మునుగనపుడు
ఎట్లు గడిపితిమో బ్రతుకెల్ల మనము!
వ్యర్ధమయ్యెను దినములు వత్సరములు



మన మనస్సులు రెండు సమాధులందు
గాఢమౌ సుషుప్తి మునిగి కరిగిపోయె
నిన్ని సంవత్సరములేమి ఎరుగకుండ
కన్నులను విప్పి నేడు మేల్కాంచెనేలొ!

ఆడితిని ప్రక్క ఇండ్ల నేస్తాల కూడి
చిన్నతనమున యాటలెన్నెన్నో నేను
కాని నీతోడనానాడు కలిసి యాడి
యతులితానందముని పొందనైతి గాదె!

చిన్న కాగితపు పడవ చేసి వర్ష
జలమున వదిలితిని నాడు సంబరమున
ఆ మధుర శైశవానంద మందు పాలు
పంచుకొన నీవు లేవంచు పరితపింతు

# వంగూరి ఫౌండేషన్ నిర్వహించిన ఉగాది రచనల పోటీలో బహుమతి పొందిన కవితలు

## మొదటి బహుమతి పొందిన కవిత

### ప్రవాహం

-యోగానంద్





పెను లోతులు తవ్వుతూ,
అక్షర శిల్పాలని చెక్కుతూ
అనర్గళంగా ప్రవహించే
కొలొరాడో నదిలా -
మస్తిష్కలోలోతుల్లో
నేను పయనిస్తూ ఉంటా...

ఆనకట్టలా!
నాకు లొంగి
నాలో కలిసి పోతాయి!
నా శక్తికి రూపాన్నిస్తాయి...

నన్నందరూ గ్రహించలేరు..
కొందరు మాత్రం -
నాలో మమేకమై
మళ్ళీ జన్మిస్తారు!

అగ్ని గర్భం లోంచి
పుట్టిన సెకోయా చెట్లలా
ఆకాశాల్నెదిరిస్తూ

పైపైకెదిగిపోతారు!
సంశప్తకులై...
కవులై నిలుస్తారు!

## రెండవ బహుమతి పొందిన కవిత



### కాగితం పడవలు

"నచకి "



ఒంటరిగా నడుస్తూంటే
వానజల్లు నన్నే వెతుకుతున్నట్టు
పరిగెత్తుతూ వచ్చింది...

సన్నని తుంపర నా మొహం మీద
అక్కడక్కడా.. ముట్టీముట్టనట్టు
మెల్లిగా, జాగ్రత్తగా అద్దుతూ
పియానో మీటీమీటనట్టు
చల్లగా, బహుకొత్తగా ఆడుతూ...
వాన చేతిలో నేను..
స్వచ్ఛత ఈ నీటిలో ఉందో...
చలిగాలి చాటులో ఉందో...
నాలో మాత్రం నిండుగా వచ్చి చేరింది!

గాలి గొంతు శృతిలో
హరిప్రసాద్ చౌరాసియా వేణువులో మ్రోగాలని
నీటి ధాటి లయలో
రవి శంకర్ వేళ్ళ కింద సితార్ తీగలా
మూర్చనలు పోవాలని

ప్రకృతి మాత ఒడిలో
నన్ను నేనుగా కోల్పోవటాన్ని
నేను నేనుగా ఆస్వాదించాలని...
నా కోరిక తీర్చటానికి
ఆ వానకు తీరికేదీ?

నాకు తనివి తీరేదాకా
వర్షం ఎప్పుడూ నాతో ఆడుకోదు!
నేను మెల్లిగా నడుస్తూ
చినుకులతో చెలిమి చేస్తూంటే
అంతకే బెదిరి
తమ స్నేహితులందరినీ పిలుచుకొస్తాయి చినుకులు -
నన్నొక్కణ్ణీ చెట్టు కింద ఆపేస్తాయి!
నేను కేరింతలు వేస్తూ
నీళ్ళలో కాళ్ళు ఆడిస్తూంటే
పెద్దగా ఏడ్చి నన్ను తరిమేస్తుంది వాన -
ఏ ఇంటి కప్పు కిందికో!
మనసులో భావాలతో
కాగితపు పడవలు చేసే లోపే
రంగుల రథం మీద
పరుగెత్తిపోతుంది వర్షం -
ఎందరో ఎదురు చూస్తున్న మరోచోటికేమో!

చివరికి మిగిలేది
వాన వదిలేసిన రంగులరాట్నం...
మట్టివాసన..
...కాగితపు పడవలు ...
ఆ రంగుల్ని కాగితాల్లో దాచేసి
జ్ఞాపకాల వాసనలతో నేను!

# మూడవ బహుమతి పొందిన కవిత



## పువ్వులు

- చెరుకూరి రమాదేవి

పువ్వులేమంటున్నాయి?
మాటరాని, ముగ్ధ శిగ్గ
మల్లెలూ, మొల్లలు,సంపెంగలు, సన్నజాజులు
పువ్వులేమంటున్నాయి?
మనసులేని మానవునితో - పువ్వులేమంటున్నాయి?
పూవు పూవు కోసి, కోసి, రాసులుగా పోసి పోసి
సూదులతో గుచ్చి తీర్చి, మాలలుగా మార్చివేసే
మనసులేని మానవులతో పువ్వులేమంటున్నాయి?



కప్పులలో, కొప్పులలో, గోడలపై, మేడలపై
నటులచేత, విటుల చేత, నలిగిపోయి
నేలరాలె పువ్వులేమంటున్నాయి
మనసు లేని మానవుని చేతలకు పువ్వులేమంటున్నాయి?

ఒక్క దినమే జీవితమని, మట్టిలోన రాలిపోయి
మరుగున పడి పోతామని-
భగవంతుని పాదాల దరి చేర్చి పొమ్మని,
మాలగా దేముని, మెడ నలంకరించమని,
భక్తులతో బేరాలు చేస్తూ వున్నవి

## పునరపి...

- సాయి బ్రహ్మానందం గొర్తి

ఓ ప్రతి ధ్వని మెల్లగా కనుమరుగవుతోంది.
ఓ స్నేహం నిశ్శబ్దంగా వీడ్కోలు తీసుకుంది.
కాలికింద భూమి మెల్లగా తప్పుకుంటూ
నిర్వేదానికి దారి చూపిస్తోంది.
నిన్నటి కరచాలనాలూ కౌగిలింతలూ
జ్ఞాపకాల కన్నీళ్ళు తుడుస్తున్నాయి.
శాశ్వతమనుకున్న క్షణాలన్నీ
పంజరం భ్రమలో చిక్కుకు పోయాయి.
పంజరంలో అస్థిపంజరాలు పలకరిస్తున్నా
ఏమీ కాదు అన్న భావన
అహం తొర్రలో దూరిపోయింది.
అన్నీ ఎగిరిపోయే పిట్టలే
ముందూ వెనుకా తేడాతో!
ఇంకా అహంకారం గుట్టపై వాలుతూనే ఉన్నాయి.
ఓ నిష్క్రమణ మెల్లమెల్లగా
అడుగు జాడల్ని తుడిచేస్తుంది...
గతం వేదిక పైకి మెల్లగా నెట్టేస్తుంది.
ప్రతీ శ్వాసా అక్కడ తెరదించాల్సిందే!
ఊపిరుండగా చల్లిన మంచి విత్తనాలు
మొలకలై మరణాన్ని ఉరితీస్తూ
కాలచక్రంపై పేర్లని చెక్కుతుంటాయి.
పుట్టుక ఉనికికి మరోసారి పురుడు పోసి
అపహరించబడ్డ దేహం
మరలా శాశ్వతంగా జన్మిస్తుంది.

# కార్డియాలజిస్ట్

-గోపాల్ నేమాన





చావు, బ్రతుకుల మధ్య పోరాడు వృత్తి నాది
రెంటినీ సమన్వయించు శక్తి లేదు నాకు
వెచ్చని రుధిరమ్ము చిందించు వృత్తినాది
రక్తమ్ము చిందించి బ్రతికించు వృత్తికూడ
నాదె
కత్తి కోతల వంటి మాటలాడు వాడ కాదు
నేను
కత్తి కోతలు పెట్టి, కుట్టి బతికించు వృత్తి
నాది
ప్రాణముల మీదకు వచ్చు పరిస్థితులలోన
పరిగెత్తి పనిచేయు వృత్తి నాది, కానీ.
నిత్యజీవితాల మామూలు పనులు
చక్కబెట్టుట నాకు చాతకాదు

వంటికి చిక్కిన రాక్షసుడవంద్రుడు
లేక, బాధపడకు, నిమిత్తమాత్రుండ వంద్రు.
నన్ను దేవుడని పొగడు రోగాలను చూచి
చచ్చుచుంటిని నేను దినదినమీ అనృతాల మధ్య
దేవుడెట్లు మన మధ్య తిరుగునన్న
సత్యమును గనలేని మూఢజనులు వారు..

హృదయరోగ నివారణా వృత్తి, లోన
హృదయాలు స్పందించు కథలెన్నివింటి
జీవితపాఠమ్ము లెన్నియో నేర్చుకొంటి
కాని నా జీవితము మలిచికొనుశక్తి, వ్యవధీ లేకపోయె,

నాపైన పూర్తి నమ్మకమ్ముంచి
ఎన్ని స్మృతులు నాతో పంచుకొని నారో

ఆఫీసు నాల్గుగోడలు సాక్షిగా నిలువ
బతికి వేసారి కాలగర్భమ్మున కలిసినారు
వారి స్మృతులు నాలోన నెన్నడూ,
నిలిచియుండు నేను నిర్గమించేదాక..

హర్షాతిశయోపేత ఆలింగనాలూ
బాష్పపూరిత తప్త శ్వేత కంచుకాలు
వేదనాభరిత ముఖచుంబనాలు
కృతజ్ఞతా పూర్వ కరచాలనాలూ
నిత్యమూ వెన్నంటివచ్చు విలువైన నిధులు..

ఇంత చక్కటి మార్గాన నాపై
ఇంత బాధ్యత నా నెత్తిమీద వేసి
నీ కార్యకలాపాలూ, లీలా వినోదాలూ
నా మనోవాక్కాయ కర్మలుగా చేసి
నడిపించినావయ్యా దేవాది దేవ..

షష్టిపైన సప్త వర్షములు చనియె
నీదుకార్యమ్ము తీరు సమయమాసన్నమాయె
నీదు ప్రతినిధిగా నింకనేనుండలేను
నీ ఇంటి తాళాలు నీకప్పగింతు
బరువుదించుకున్న భారవాహుడనౌదు..!

# రసరేఖలు

-బచ్చోటి శ్రీధర్



చెలియ! నీకొరకిచట విచ్చిన గులాబి
పూవు రేకుల సందులలో విచలిత
చిత్తమున వెదకికొనుచు జీవితమ్ము
నెల్ల యీరీతి గడపెదనేల నేను?



నీదు ప్రేమయే కారణమా? దినమ్ము
రాత్రియను భేదమే లేక రమ్యభావ
నాప్రపూర్ణ మధుర రసానందమందు
కరగిపోయి గడపుటకు కాలమిట్లు

ప్రేమమీరగ నీకు అర్పించు కొరకు
అందమైన నా మానసోద్యానమందు
పూలు పూయించుచున్ పొంగిపోదునన్న
నీదు కన్నులే నన్ను బంధించెనేమి?

దివ్యమధురానుభూతి పొందెదను నేను
నీ అమృతమూర్తి నెడద సంధించుకొనుచు
ఇంత అవ్యక్తమైన యీ సంతసమ్ము
నకు చెలీ! నీవె యాలంబనమ్మగుదువె?

అందమున నెందరో కలరవనియందు
మంచి మనసైన నెడనెడ కాంచగలము
సతతము నీయందు లగ్నమౌ స్వచ్ఛ చిత్త
వృత్తి నాకుండె - లేనిచోనేమి యగునో?

## ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

# హత్య చేయబడిన ఆత్మ

'నిశాపతి'



అతనికి పీ ఆర్ సీ లు లేవు, ఫిట్మెంట్లు లేవు
కరువులేగానీ బత్యాలు లేవు.
అతను సమ్మె చేస్తే సృష్టి శిలాజాలుగా మారుతుంది
కానీ అతనికి యూనియన్లు లేవు. జే ఏ సీ లు లేవు.
అతని మరణం వార్త కావడం ఎప్పుడో మానేసింది.
ఇప్పుడు అతను పేపరు పంక్తుల మధ్య బిక్కుబిక్కుమనే ఓ గణాంకం!

బౌలింగుకీ బ్యాటింగుకీ మధ్య
రూపం కోల్పోతున్న బంతి!

పాపం, అతనికి లెక్కలు రావు.
రెక్కలపైనే తప్ప లెక్కలపై బతకడం తెలీదు.
ఉచిత విద్యుత్తులోనుంచీ అనుచిత విద్యుత్తు పోతే
మిగిలేది ఎంత శాతమో అతనికి తెలీదు
విత్తనాలూ, పురుగు మందులూ, ఎరువులూ
అన్నీ అతనికి కర్ణుడి శాపాలే!

కర్త 'కులం' అని చెప్పుకుంటాడు గానీ,
అది అటు అగ్రకులం కాదు, ఇటు ఉగ్రకులం కాదు

ఫోటోల్లో మాత్రం అందరూ అతడి అందలాన్ని మోసేవాళ్ళే!
కానీ ప్రభుత్వ వీలునామాలో చివరికి అతని వాటాకి మిగిలింది
ఒక్కటే!
'మరణ భృతి'!!

## ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## మాట కచేరి

ఏటూరి నాగేంద్రరావు



తుంచేసుకున్నట్టు
తుంచి ముడేసినట్టు, మరీ అతుకేసినట్టు...
విరిచి అంటుకట్టడానికి
ఇదేం పూల మొక్కకాదు
మాట మనసుని స్పృశించే మంత్రం
వెయ్యిగాయాల ఊరట మాట
దహించే నిరాశల్లో ఆశల కొండ
పదిరాతి గుండెల్ని కరిగిస్తుంది
ఆత్మీయతల సెలయేరై ప్రవహిస్తుంది
పలుకును ములుకు చేస్తే
అది గుండెను పుండు చేస్తుంది
మాట వెన్న ముద్దలా ఉండాలి.
తాకితే నరాల్లోకి మానవత్వం స్రవున పాకాలి
పెదవి దాటిన మాట మంచు కురిసినట్టు
ఎదుటి వాళ్ళ కష్టాన్ని పంచుకున్నట్టుండాలి

కన్నీటిని చేత్తో తుడిచినట్టుండాలి
మాటలోని మర్మం అమ్మకే తెలుసు
అమ్మ పేగు తెంచుకున్న ప్రాణబొమ్మకీ తెలుసు
చిలక పలుకుల్తో చుట్టూ ఉన్నవారి చుట్టూ
మంత్ర బంధం వేయడం పాపమాటలోని మహిమే కదా
పాటగా పల్లవిస్తే మాట
పశువుకైనా సంకెళ్ళు వేసినట్టే
పంచభూతాలని దిగ్బంధనం చేసినట్టే
అందుకే మాటని గుండె గొంతులోంచి పలకండి
మమతల రంగులో అద్దండి
మానవతా పరిమళాల ధనంలో మాటకి వాటా పంచండి!



## నడక నేర్చుకో

- రామా చంద్రమౌళి



వద్దన్నా వస్తున్న పీడకల ఇది
విపణివేదికపై మనిషి వ్యాపారవస్తువుగా ప్రదర్శించబడుతున్న
సందర్భంలో
స్త్రీవా, పురుషునివా అన్న మీమాంస వద్దు
ఏ వస్తువైనా అమ్మబడవచ్చు, కొనబడవచ్చు - విలువ ఎంత అన్నదే ప్రశ్న.
నాల్గుకాళ్ళు, నాల్గు కళ్ళు, రెండు హృదయాలు కలిసి వెళ్తాయి
వచ్చేటప్పుడు రెండు కాళ్ళు, ఒక రాతి హృదయమే
కన్నీళ్ళు శిలాంతర్గత రహస్యమై అదృశ్యమౌతాయి -
తలవంచుకుని వెక్కెక్కిపడుతూ నిశ్శబ్దంగా నిష్క్రమించడం
ఒక అనివార్య అభిశాపం,
నగరం నడిమధ్య కొండల గుండెలపై కట్టుకున్న
కోటిన్నర రూపాయల అపార్ట్‌మెంట్‌ను చుట్టూ చుట్టుకున్న మనిషికి
ఫ్లవర్వేజ్‌లో అశ్రుతర్పణమే జీవితమైనపుడు

బయట సిమెంట్ కాంక్రీట్‌లో పాదాలు
ఘనీభవిస్తూండడం
ఒక యాదృచ్ఛిక సత్యమే కదా!
శీతాకాలపు రాత్రులన్నీ
కాల్‌సెంటర్లలో కుదవబెట్టబడ్డ విషాదసౌందర్యాలౌతున్నపుడు
జెండర్ ఏదైతేనేమి నిశ్శబ్దంగా కళ్ళుమూసుకుని ఒక కాగితపు చుట్టవై
కాలిపోవడమే కదా -
బ్యాంక్ బ్యాలెన్స్‌లన్నీ
మిధ్యాక్షరాలై ఉండీ లేనట్టూ, లేకా ఉన్నట్టూ భ్రాంతిస్తున్నపుడు
ఇక వర్తమానం
ఒక చేజారిపోతున్న గాజుబొమ్మ -
చెంప ఛటేళ్మనీ పగులుతున్నవేళ
తింటానికి అన్నమే కావాలనీ
బంగారం తింటానికి పనికిరాదనీ తెలుసుకుంటున్నపుడు
జాగ్రత్త.. జాగ్రత్త.. అడుగులు తడబడుతున్నాయి
జీవితం.. ఎప్పుడూ కత్తి అంచుపై నడకే
తమాయించుకుని... నిర్మలమైన చూపులతో నడక నేర్చుకో -

## ప్రియా!

-కుమార్ కలగర



నేను నీదగ్గరికి వచ్చినప్పుడు
నా దగ్గర ఏమి లేదు,
అప్పుడు నువ్వు
నీ హృదయన్ని నాకిచ్చావు!
నాకు అన్నీవున్నాయి,
నీ వూహాలు నా లో నిండిపోయాయి!
నా జీవితానికి ఒక అర్థం ఏర్పడింది
ప్రియా!

నా జీవితానికి నువ్వు
ఒక కారణానివి,
ప్రతి వుదయం
సంధ్యా రాగానివి,
ప్రతి రాత్రి
మిల మిల మెరిసే నక్షత్రానివి,
గులాబి వన
సౌరభానివి,
వసంతమాసపు తొలి
సుమ సుగంధానివి,
నువ్వే నా గుండె చప్పుడువి
ప్రియా!
నువ్వు లేకపో తే
నా జీవితం శూన్యం,
చుక్కలులేని రాత్రిలా
పాడలేని కోయిలలా,
కాంతిలేని సుర్యుడిలా
నువ్వు లేకపో తే
నా జీవితం శూన్యం.
ప్రియా!
నీ ప్రేమని తలచు కున్నప్పుడల్లా
నా హృదయంతరాల్లోంచి నవ్వు పుట్టుకొస్తుంది.
నీ స్నేహాన్ని తలచు కున్నప్పుడల్లా
కాలమిలా ఆగిపొతే బాగుండుననిపిస్తుంది.
నీ చిరునవ్వు తలచు కున్నప్పుడల్లా
పండు వెన్నెల్లో విహరిస్తున్నట్లనిపిస్తుంది.
నువ్వు నా పక్కనున్నప్పుడల్లా
ఎండకి వానకి తేడాలేదనిపిస్తుంది.
అందుకే
నీతోటె నా జీవితం
ప్రియా!



అందుకే
నీతోటె నా జీవితం.

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు





ప్రేమతో తెచ్చి నా మనోధామమందు
నాటి, దాని కుదుట జీవనమ్మునుంచి
పవలు రేయెల్ల నా ప్రాణము వలె కాచు
చుంటి నీ కొరకు గులాబి యంటు నొకటి

నెమ్మదిగ చివురు దొడగె నేను హృదయ
మందు నీపయి పెంచుకొన్నట్టి యతుల
రాగరసవికాసము వోలె - ప్రాణమందు
ప్రాణమట్లుగా దాని కాపాడుచుంటి

బ్రతికి తలయెత్తి తీవిగా బయలు చూచె
పూప చివురులు తొడుగగ పొంగి పోతి
గడపుచుంటిని కాలముత్కంఠ తోడ
పూలు మాత్రము పూయదు పొగిలిపోతి

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## భయకంపం

- ఎమ్వీ రామిరెడ్డి , హైదరాబాదు



నడుస్తుంటాం
కత్తులు
మొనదేలి ఉంటాయి
ప్రయాణిస్తుంటాం
ప్రమాదాలు పొంచి ఉంటాయి
నిలదీయాలనుకుంటాం
నినాదాలు గొంతులోనే ముడుచుకు పోతాయి
విహరించాలనుకుంటాం
రెక్కలు సలపరం పెడుతుంటాయి
నిద్రిస్తాం
కలలు భయపెడుతుంటాయి

భయమే అంత
లోపలి గోడలన్నీ మసకబారుతుంటాయి
నెత్తిమీద నెలవంకను

అమావాస్యలు వెంటాడుతుంటాయి
పావురాలకు గింజలు చల్లబోతున్నా
చేతుల మీద వాతలు తేలుతుంటాయి
భయకంపం ఉరిమిన ప్రతిసారీ
నిగ్రహం నేలమట్టం!

మొత్తం బతుకు దూరమెంత?
అందులో నిద్రెంత?
మెలకువలో చలనమెంత? నటనకెంత?
తినడానికెంత? తాజాదనాన్ని అడ్డుకోవడానికెంత?
మిగిలిన దూరం జానాబెత్తెడు
ఆ కాస్తలోనే కత్తుల వంతెన్లకు భయపడాలా?
గాయపడతామేమోనని కాళ్ళను గొలుసుల్తో బంధించుకోవాలా?
కొన్ని మౌలిక ప్రశ్నల్ని
ముక్కుతో పొడుచుకు తింటం మానేశాం
ముసురుకునే జోరీగల్ని
రెక్కలతో విసరడం వదిలేశాం

ఇప్పట్నుంచైనా పాదముద్రల్ని బలంగా అచ్చొత్తుకుందాం
బెరుకులేని బతుకు రాగం అందుకుందాం
మెలుకువ పొడవునా నిర్భయ నినాదాల్ని
ఆకాశం వైపు గురి పెడదాం
పిచ్చి మొక్కల్ని పెరికివేసి
పిరికితనపు అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేద్దాం
ప్రతి మాటా ఒక ఫిరంగిలా ప్రతి కదిలికా ఒక తరంగంలా
మనమంటే భయకంపాలకు వణుకు పుట్టేలా...

ఇప్పుడు
లోపలి గోడలన్నీ వెల్లవేయబడతాయి!
నిండు పున్నములు వెన్నంటి నడుస్తాయి!!

## రేవు బావురుమంటోంది

- 'నిశాపతి', హైదరాబాదు



శేషేన్, శేషేన్
నీకై ఏమని
రాసేన్ రాసేన్

వాల్మీకికి వారసుడివా?
కార్మికుడికి ఔరసుడివా?
స్వప్నం బాష్పం కలిపిన
పుష్పోడి వజ్రాయుధానివా?

కండల కొండల్లో ఉదయించిన
చెమ్మట నేస్తానివా?
గుల్మోహరు తోటల్లో విహరించిన
కమ్మటి గీతానివా?

యూకలిప్టస్ శిఖరాల వీధుల్లో చరించే
ప్రేమికుడివా?
చీకటి నిశీధుల బాధల్లో జ్వలించే
శ్రామికుడివా?

మట్టిలో ఉన్న కస్తూరి తీసే
మాటల మాంత్రికుడివా?
నీ నెమలితో
మేఘాల నీడల్లో విహరించే
దేశదిమ్మరి యాత్రికుడివా?

పారశీక దర్బారు హుక్కా పొగరు పొగవా?
భారతీయ దర్శనాల పరిమళాల అగరు సిగవా?

భవభూతికీ ప్లాటోకీ దుబాసీవా?
మాటల మర్మాలు తెలిసిన
మల్లినాథ సూరివా?
శబ్దాలకి 'రెయిన్‌బో' అద్దే రాంబోవా?
శేషేన్ శేషేన్
నినాదాలు కవిత్వం అవునోకాదో
నీవు నినదించింది మాత్రం
ఖచ్చితంగా అచ్చమైన కవిత్వం కోసమే!
ఓ పువ్వు అడగడం కూడా తెలీని మాకు
ఓ పూలతోట
ఇచ్చావు

విప్లవ భాషావిధాతా!
నీవులేని ఈ తోటలో
పూవు బావురుమంటోంది పిల్లన
గ్రోవి బావురుమంటోంది ఒంటరి
దీవి బావురుమంటోంది సుకవితా
రేవు బావురుమంటోంది



## వడిసెల రాళ్ళు

-జ్వలిత , వరంగల్

పాలకంకుల పై పైర పిట్టల అత్యాచారం
గుండె గోడల నిండా దొగ్గొట్టబడుతున్న అయిష్టపు
చిత్రపటాలు
సమస్యల దిగుడు బావులలోకి

రాకపోకలు ఆశల కాళీ కడవలతో
అనుభవాల చెత్తనూడుస్తూ, కాలుస్తూ
అలసిపోతున్న అగ్నిగుండం
తూర్పు దిశన ప్రసవ వేదన ప్రతిదినం
విప్లవ కాంతుల స్రవిస్తున్న రుధిరం
మృత్యువుకు తప్పని బలత్కారం
ఆత్మహత్యా ప్రయత్నం
విశ్వాన్ని విషపూరితం చేసే
అంధ విశ్వాసపు వీచికలు
అత్యాశల రెక్కలతో విహాయసపు విహంగం
ఇంధ్ర ధనస్సు రంగులను తప్పు లెన్నుతూ
కాలచక్రపు మొండి మొండిగా
అనంతానంత అరికాళ్ళకు గుచ్చుకుని
చట్టాల చక్రాలకు కొత్త మేకులు ఎన్ని
కొట్టినా
జరిగి (జారి) పోతున్న నేరాలు, హింసలు
గట్టిగా చూడలేని కట్టుబోతులు
పళ్ళూడ గొట్టబడిన మంత్రగత్తెలు..
పాల కంకులు ఇకపై
వడిసెల విసరడం నేర్చుకోవాలి
గుండె గోడలు అయిష్టాలను రాల్చేయాలి
మేకులూడ దీసి...
మృత్యు భయాన్ని చావగొట్టి
జీవితపు అమృతాన్ని వుగ్గపట్టడానికి
తెగువను చుట్టుకున్న అతివలు కావాలి
బలవంతంగా అబలను చేసినందుకు
ఓటమి రాళ్ళను వడిసెలతో విసరడానికి!



# హై 'క్లూ'లు

- తరిగొప్పుల. వి.ఎల్లెన్. మూర్తి , హైదరాబాదు



సూరీడు
నిప్పులు "చెరుగుతుంటే"
ఎండ "దంచు"తోంది.!

స్వర్గానికి బదిలీ!?
ఇంట్లో పిల్లాడు
హాస్టల్‌కి వెళ్ళిపోయాడు..!



కళ్ళల్లో ఒత్తులేసుకుని ఆమె!
అతనొచ్చి వెలిగిస్తాడనీ!!



మా వీధిలోనూ
నయాగరే!
పిల్లల కేరింతలు!

ఎండ రాబందు
చెరువు శవాన్ని
ఇసుకతో నంచుకుంటూ!!

మంటుటెండ
చెప్పుల్లేకుండా అతను...
ఆకలే ఈడూ 'జోడూ'

భాషరాని హీరో
భాషే తెలియని హీరోయిన్
తెలుగు సినిమా!

# రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు



ఈ ప్రణయ రాగ గీతమ్ములెల్ల నిట్లు
గొంతు విప్పి పాడుదును నల్గురు వినంగ
ఈడ్చినాను బయటకు నిన్నిట్లటంచు
అలుక బూనగవలదు నా యందు నీవు

వలచి మూడవ కంటికి తెలియకుండ
నా కొరకు జీవితమునర్పణమ్ము చేసి
వెలుగులను పంచిపెట్టు దీపికయనంగ
కరగిపోయెడునిట్టి యుత్కంఠ యేల?



ఇన్ని దినముల నుండి యిన్నేండ్లనుండి
గుండెలోతుల గదులలో గూళ్ళు కట్టి
పేరుకొన్నట్టి నా ప్రేమ వెలువరింప
పలుకుచున్నాను నాపైన యలుక యేల?

నా హృదయరసోద్యానవనమ్మునందు
పారిజాతపరిమళమ్ము బరపినట్టి
ప్రణయమూర్తిని గూర్చి ప్రపంచమునకు
తెలుపుకొనుట దోషమ్మని తలచలేను

ఇది మహాపరాధమ్మగునేని చెలియ!
చేయగల్గినదేమియో చెప్పలేను
జీవితము నీకు కానుక చేసినాను
నీకె వదలివైచితి తుదినిర్ణయమ్ము

# ప్రియతమా!

- ఉమ చింతలపాటి

చింతలన్ని దూరమయ్యాయి వెచ్చన్ని నీ కౌగిలి లో వొదగగనే
తలపులన్ని నిలిచిపోయె చల్లని నీ నీడలో చేరగనే
లయ తప్పె నా గుండె చప్పుడు నీ పేరు నా చెవిన పడగానే
పాలు గారె బుగ్గ ఎర్రబడి సిగ్గులొలికె నీ రూపు కనగానే
టిం టిం అనే తారలన్ని నా చేతికి అందాయి నీ చేయి అందుకోగానే
ఈ క్షణంలా ప్రతి క్షణం వుండాలని దేవుని కోరుకుని
శ్వాస ఆగిపోదు నీతోనే వందేళ్ళు కలసి హాయిగా బతకాలని
రమ్యమైన మన కాపురాన్ని దేవతలు అశీర్వదించాలని
సరసాల మధుర సరాగలు తియ్యగ కలసి ఆలపించాలని
త్యజించాను సర్వస్వం నీ కోసం నీవె నా ప్రాణం
ప్రణయ ఆనంద లోకాలలో విహరించాలి మనం నిరంతరం
సాధించాను నీ హృదయంలో స్థానం నీ ప్రేమ వరం సుమస్వరం
ద్న్ ద్న్ సంతోష నృత్యమే సంసారం సంబర సాగరం



# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## ది హాఫ్ బ్లెస్సెడ్

- టి. వెంకటేష్ , కర్నూలు



కాల రేఖపై కొన్ని అడుగులు
పాద ముద్రల్ని వెక్కిరిస్తూ కొన్ని నోళ్ళు
ప్రవహించినంత మేర
వంకర అడుగుల్ని వెంబడించే కళ్ళు

ఒక లయ సంకేతం
శబ్దమై విస్తరిస్తుంది
ఒలికే ప్లాస్టిక్ నవ్వులు
పాటలై చిందులై వినోదాన్ని పూస్తాయి
అతుకుల అలంకరణ
రోజుకో సింగారింపై బయల్దేరుతుంది
పలకరింపుల చిలకరింపు
వారసుల్ని కలిపే చుట్టమవుతుంది.
పులుముకున్న చనుకట్టు ఉనికి
నడిచినంత మేర చిల్లరై కురుస్తుంది
ఒక శాపగ్రస్త చలనం
రంగస్థలంపై సాగుతూ ఉంటుంది
ఎక్కడో ఎగతాళి హాస్యమై
బండబారిన గుండెలను గాయపరుస్తుంది

బదులుగా ఇగిరిన పచ్చదనం
నగ్నసత్యాన్ని
మొరటుగా ప్రదర్శిస్తుంది
భరించలేని సున్నిత హృదయాలు
సిగ్గులేని చర్యగా వ్యతిరేకిస్తాయి

లోప మూలాల విశ్లేషణ మనకు చేతకాదు
క్షేత్రమూ బీజమూ కాని
దేహాల లేమి మనకర్థం కాదు
ఏ చలువ గర్భాలకో పూచి
ఇసుక మేటలైన సంచార గొంతుల
చేదు పాటలు మనకు వినిపించవు
దేహాన్ని వెలిగించే చెకుముకి రాళ్ళకై
నిశిరాత్రుల వేళ...
నిర్లజ్జగా తిరుగాడే దేహాల చింత మనకనవసరం
మత్తెక్కిన మత్తేభాల పథ ఘట్టణల కింద
నిరంకుశంగా నలిగే శరీరాల యాతన వదిలేద్దాం

సమూహాల్లో ఒంటరులై
చీకటి ద్వీపాల్లో తేలియాడే
పొగచూరిన దీపాలు వాళ్ళు

ఎక్కడో చిగుర్చి
పిడికెడు సానుభూతి లేకుండా రాలే
అనామక ముఖాలు వాళ్ళు

ఒక అసహజ వేషాన్ని
సహజంగా మోస్తూ
ఆత్మీయ కరచాలనాన్ని కోల్పోయిన
కరుకు గాయాల గన్నేరు చేదు వాళ్ళు

## వెంటాడే పిలుపు

- మూలా సుబ్రహ్మణ్యం





ప్రతి రాత్రీ
సముద్రం నన్ను
"రా.. రా.."
అని పిలుస్తుంది.

పారే నది నాకు
దారి చూపిస్తుంది.

చంద్రుడు దారంతా
వెలుతురు పరుస్తాడు

చిన్ని పడవలో
ఒంటరిగా నేను.

## ఆమె

- యోగానంద్



నిండు పున్నమి వేళ
పండు వెన్నెల అలిగిందట!
చంద్రుడు "తన అందం"తో, గర్వంతో
ఇంకెవరి మీదో మనసుపడి
అంబరమంతా చెలరేగిపోతున్నాడట!

అసూయతో రగిలిపోతున్న
వెన్నెల
ఆమెను కప్పేసిందట, కమ్మేసిందట!
అమాయకురాలు!



వెన్నెల్లేని వన్నె లాడితో
వన్నె లేని సంగమంలో
దివి లాభం లేదని
భువి కేగాయట,
ఆమె కన్నుల్లోనే ఉండిపోదామని
తరలొచ్చేసాయట తారలు!

ఉన్న ఆ ఒంటరి మేఘం
పన్నీరై కురిసిపోయిందట,
ఆమెను తడిపేసి మురిసిపోయిందట!
.. ... ...
ఇలా మేనంతా వెన్నెలతో,
అలా కన్నుల్లో తారలతో,
పన్నీటి జల్లుల్లో తడిసి
ఉన్నాటి ఆమె కౌగిట్లో...
రసకేళి విన్యాసంలో
నాకు తెలీలేదు...
ఆ వెన్నెల, తారలు మేఘం
తమతో ఆకాశమంత శూన్యం కూడా తెచ్చాయని!

## ఒంటరి రహస్యం!!

- నిషిగంధ



నేలకూ నింగికీ మధ్య
కడుతూ ఆపేసిన ప్రాచీన వారధిలా..



ఏ ఝామున జాబిల్లితో
దోబూచులాటలో!
శిఖరాన సేద తీర్చుకుంటున్న
మబ్బు తునకలు..

మెలమెల్లగా అలుముకుంటున్న
పచ్చదనం...

ఏ వింత అనుభవాన్ని
పంచుకుంటున్నాయో!
మూకుమ్మడిగా
గువ్వల కిలకిలలు..

అలుపెరుగకుండా
పాదాలతో ఆడుకుంటున్న
సెలయేరు..
ఆసాంతం చైతన్య ఝరి..
తను మాత్రం నిశ్చలంగా!
విశ్వరహస్యాలను భద్రపరుస్తూ!!

# రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు



చెలియ! నీ తోడనెలమి భాషించు కొరకు
స్వాంతముననెంచి యెంచి నే వచ్చు వేళ
నీవు నిదురించుచుంటివి నిర్మలముగ
ముగ్ధమోహనదేవతామూర్తి వోలె

గాలికి కడలియల వోలె కదలుచున్న
పాల నురుగు బోలెడు తెల్ల వలువగట్టి
అలకలు నుదుటిపై యల్లలాడుచుండ
పవ్వళించితి దివ్యశిల్పమ్ము వోలె



చేతనమ్మున మనమన చిత్తములకు
తగులుకొన్నట్టి రాగబంధమ్ములిపుడు
నిలచియున్నవో లేక మార్పులను బొందె
నో యెరుంగ నీవిటు నిద్రలో మునుంగ

నామనస్సు నిన్నును నీమనస్సు నన్ను
తలచుచుండును సతతమ్ము తెలివియందు
నేడు నిద్రాణమైనది నీ మనస్సు
ఎరుగలేను నన్నిప్పుడు మరచెనేమొ!

నిదురలో గూడ నా యూహ వదలలేక
తీయతీయని స్వప్నాల తేలునేమొ!
ప్రేమబంధమ్ములెల్ల పరిత్యజించి
యెడద నిర్వికారస్థితి బడయునేమొ!

## ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

### అడ్మ్యులేటరీ నుంచి అడల్టరీ దాకా....

- కె.ఎ.మునిసురేష్ పిళ్ళై , హైదరాబాదు

కోపం, అలక, నవ్వూ, ఏడుపూ
ఒక్కో ఉడుపూ
ఒక్కో పరిణామ దశలో వదిలేస్తూ వచ్చాను.
అమ్మ గర్భం నుంచీ - ఇపుడున్న 'రెడ్' పర్సనాలిటీ వరకూ.

కావాల్సిందీ - ఉండాల్సిందీ...
వండాల్సిందీ - పండాల్సిందీ...
ఇపుడొక్కటే
'క్లయింటు' ఆసక్తిని గుర్తెరగడం.
ఎరగడంలో వడీ వేగం!!
క్లయింటు ఆశించే అనుభూతుల మాస్కులు
బొచ్చెడుంటాయి...
తను ఎవరో మరిచిపోయిన మన తల పెట్టె నిండా!
చకచకా మార్చేస్తూ బతకడమే నిత్యం.

మన ఏడుపుతో ఎవడికేం పని?
ఏకరువు ఎందుకు?

మన విజయం ప్రస్తావించగానే
ప్రతివాడికీ తన విజయపరంపర గుర్తొస్తుంది.
ఆ తేనెతుట్టె కదపడం ఎందుకు?
క్లయింటు...
సంతోషిస్తే ఆ నవ్వును నువ్వూ పులుముకోవాలి.
ఆ విజయాన్ని ' జయ జయ' మని కీర్తించాలి.
బంధం దృఢంగా ఉంచే ఫెవికాల్ -
నిత్య వ్యవహారంలో నిర్లజ్జగా చొరబడ్డ తత్వం -
అడ్యులేటరీ.

హిడెన్ ఫోల్డర్ 'అవ్యక్తం'లో -
ముళ్ళూ రంపాలు మంటలూ సదా వాటి పనిచేస్తుంటాయి.
హార్డ్‌డ్రైవ్‌లో బ్యాడ్ సెక్టార్స్ క్రియేట్ చేస్తూ!
కోపం. అలక. ఏడుపూ...
వ్యక్తం - వృధా అనే సత్యం బోధపడిందే గానీ,
అనుభూతులు పుట్టకుండానూ పెరగకుండానూ ఏం చేయగలం?

దశేంద్రియాలూ అదుపు తప్పిపోయే
దుష్ట క్షణాలు కొన్ని ఉంటాయి.
ఓ లిప్తలో మాట తూలుతుంది.
సుషుప్తిలో ఓ బొట్టు జారుతుంది.
అడావుడిగా మేల్కొని
అత్యవసరంగా అంతా సరిదిద్దేసుకుంటాం.

సర్వం... క్లయింటును బట్టి...
విరబోసిన జడలో మల్లెలు...
చెవి పక్కన సిగలో రోజా
బెడ్‌షీట్‌పై గులాబి రేకులు...
గదినిండా ధూపం, అత్తరు...
అసలేమిటో ఎంచుకునేది
ఉండాలా వద్దా అనేది

సర్వం... క్లయింటును బట్టి...

త్రికాలాలూ.. సంధ్యలూ....
మనసూ వాచా లేకుండా... చేసే కర్మంతా
అడల్టరీ.

ఇది వసుధైక వ్యభిచారం
అందులో క్రమానుగత వికాసం.
పరిణామ దశల్లో.. ఒక్కొక్కరూ ఒక్కొక్కచోట.

*-*-*-*

## చివరి కోరిక

- కాలనాధభట్ట వీరభద్రశాస్త్రి, విజయవాడ





వయసు వుడిగిన మాకు
రోజెట్టు గడవాలి
చిన్నారి మనుమలకు
సుద్దులే చెప్పాల..
చూపు ఆనని మాకు
దారెట్టు తెలవాలి
బుడిబుడి నడకలకు
చేయూత మియ్యాల..
నిదురపట్టని మాకు
పొద్దెట్టు పోవాలి
అందాల పాపలకు
కథలెన్నో చెప్పాల..
లేవలేని మాకు

సాయమయ్యేదెవరు
మామ్మయ్య తాతయ్య
ముద్దు పిలుపులె చాలు..
శేష జీవితమిట్లు
పిల్ల పాపలతో గడిపి
మనసు నిండా హాయి
కలిగిస్తే చాలదా..
ఆ తృప్తితో కాల
గర్భాన కలవమా!!

## లోకా సమస్తాం సుఖీనోభవంతు

- ఆచాళ్ళ శ్రీనివాసరావు, తుని





నా పేరు అవని
విశ్వగోళాలలో జీవమున్న భువని
జలనిధిలో కొంత ఒదిగి,
నా చుట్టూ నేను తిరిగి
రవి చుట్టూ తిరిగి తిరిగి
బ్రతుకిచ్చే దివ్యనిధిని...

నాకూ సూర్యునికి నడుమ
వీడిపోని బంధముంది.
నా చుట్టూ కవచంలా
ఓజోనను తెరవున్నది.
పొగలు పెట్టి, సెగలు పెట్టి
అడవుల్ని కొట్టి కొట్టి

చుక్క నీరు పోయకుండా
ఒక్క మొక్క నాటకుండా
సమతుల్యత మరచి పోతే
మాడి మసై పోదుము కద.
పావురాల స్థాయి నుండి
సెల్‌ఫోనుల కెదిగినారు.
మూలాలను మరచిపోయి
గాలులలో మేడలేల?
మేధోజీవుల్లారా!
ఆలోచించండ్రా!
లోకా సమస్తాం: సుఖినోభవంతు!

-*-*-*-*-

## రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు





సంశయింపకు నా ప్రేమ సత్యపరత
సంశయింపకు ప్రేమ నిస్వార్థగుణము
నా త్రికరణమ్ములీ చరణముల ముందు
కానుకగ నుంచితి గ్రహించగలవు ముందు

తెల్లనైనది విచ్చిన మల్లె కంటె
చలువ యైనది పండు వెన్నెలలకంటె
స్వచ్ఛమైనది నీహారజలము కంటె
అట్టి ప్రేమను సేతు నీకర్పణమ్ము

కల్మషమ్ము మందునకైన కానరాని
స్వచ్ఛమైనట్టి నా మనఃపాత్రయందు
ప్రేమపూవులు తెచ్చి యర్పించుచుంటి
చెలియ! అనుమానమేలనే స్వీకరింప

ఈ కుసుమముల ప్రోవును లోకులెవరో
విసరివేయగ చూతురు ద్వేష బుద్ధి
మనమనస్సుల ప్రేమసంపదల చూచి
ఈర్ష్య చెందువారల క్షమియింతువేల?

మన ప్రణయరాజ్యమొక నిండునెలసీమ
మచ్చ తేవకు లోకుల మాట నమ్మి
సత్యమౌ మన ప్రేమ విశ్వమ్మునందు
అంతమే లేనిదంచు గ్రహింతువీవు



# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## ఇక్కడో దీపం..! అక్కడో దీపం..!!!

శైలజా మిత్ర

హైదరాబాదు



నాటకం పూర్తయింది
నటించడం మొదలయింది
పాత్రధారులు సెలవు తీసుకుంటున్నారు
పాత్రలు సిద్ధమవుతున్నాయి
అక్కడ ఎవరి పాత్ర ఎవరి సొంతం కాదు
ఒకే చోట పుట్టి పెరిగినా
ఒకరి జీవితం మరొకరికి
సంబంధించినది కాదు
ఘనీభవించిన మంచుకొండ
కరిగి నీటి ప్రవాహమవుతుంది
గట్టిదయినా గుండె
ఒక్కోరోజు జారిపడిపోతుంది
సీతాకోక చిలుక రెక్కలపై
ఎగురుతున్న మనసు
సమాజ ముళ్ళపొదల్ని ఆసరాగా తీసుకుని
శాశ్వత అనుబంధానికై ఎగబాకుతోంది
ఎర్రటి ఎండలో ఎప్పుడో ఒకప్పుడు
మనం నిలబడ్డప్పుడు నీడనివ్వాలని

తన ఒళ్ళంతా కాల్చుకుంటున్న చెట్టు త్యాగం
ప్రకృతి పరిరక్షణకై పాటుపడుతోంది
గంగకు అభ్యంగన స్నానం చేయించినట్లు
హిమాలయాలకు ఉన్నికోట్లు కప్పినట్లు
సూర్యబింబానికి గొడుగు పట్టినట్లు
ఒక ప్రశాంత సమయం ఒంటరి చంద్రబింబం
నా గదిలోకి తొంగిచూస్తున్న ఏదో రహస్యం చెబుతున్నట్లు
శీతాకాలపు రాత్రి గుండెలమీద
భారంగా ఉంటోంది నా నిట్టూర్పు ప్రేమ తీర్పు.
కొండను పిండి చేసేది ఆయుధాలే కావచ్చు
గుండెను తట్టి లేపేది అనుభూతులే కావచ్చు
దారిలో వెళుతున్న దృశ్యాలన్నీ కలియ చూస్తున్న
వ్యక్తి ప్రయాణం ఉన్నట్లుండి ఆగిపోతోంది
చేతికున్న గడియారం తనపని తాను చేసుకుంటోంది
తప్పదు
నిన్న కడుపులో
నేడు దావానలంలో
రేపు దహనంలో
నేలపై ధూళికమ్మిన ఈ క్షత శరీరం మట్టిలో
విలువైన అమాయకత్వం జీవిత ఖైదులో
రక్త సంబంధాలు అంతస్థుల తారతమ్యంలో
ప్రజాస్వామ్యం కబ్జాల భూకంపంలో
నాయకత్వం నయవంచన నయగారాలలో
ఒక్కో సమయం సానుభూతి జాడలలో
ఒక్కో సమయం నిరాశా నిస్పృహలలో
ఈ అంతరంగ విరామ క్షణాలు
మనకంటూ మిగిలిన అగ్నికణాలు
సరిహద్దులలో మొలకెత్తిన ప్రతి మొక్కకు
గర్వంగా గర్జించడమే తెలుసు
పారే నదులకు పరవళ్ళకు బదులు,
పరాక్రమ నృత్యమే తెలుసు.

అచేతనంగా పడిఉన్న ప్రతి రాయికి,
దేశాన్ని కాపాడడమే తెలుసు.
జాతీయ పతాక రెపరెపల్లో,
శాంతికి నిర్వచనమే తెలుసు.
క్షణాలలో ప్రేలుడు శబ్దం...
అరక్షణంలో ఆర్తనాదం...!
వెంట వెంటనే ప్రశాంతం....
తెరచి ఉంచిన శవపేటిక
నేటి సగటు మానవుని జీవితం
ఏ భాషకూ అందని భావం,
ఏ కవీ రచించలేని కావ్యం,
ఏ గాయకుని గళానికి అంతు చిక్కని గీతం
ఏ కులానికి, మతానికి చెందని మానవత్వం,
అడుగడుగునా అడ్డుపడే సమస్యలతో యుద్ధం చేయకుండా
రాజీపడకుండా..ఆగిపోతోంది సందిగ్ధంగా...
ఇపుడు....
దెబ్బతిన్న శిశువును భరిస్తున్న తల్లిలా ఉంటోంది ఉదయం
నిత్యం విషాదగాథలా మిగిలి ఉంటోంది సంధ్యాసమయం
ఇలాంటి భారతావనిని చూడలేని స్మృతి చిహ్నాలు
నిద్రిస్తున్న నీడలా ఒకరు, కొన ప్రాణంతో కొట్టుకుంటూ ఒకరు,
చిన్నాభిన్నమయిన ప్రపంచ శాంతి మధ్య పావుల్లా ప్రజలు
అక్కడో దీపం..!! ఇక్కడో దీపం...!! ఆత్మీయులు
చెల్లాచెదురైన ముత్యాల హారంలాంటి వివాహ వ్యవస్థ
ముక్కలు ముక్కలవుతున్న మానవ సంబంధాలు
ఏకాంతం నుండీ మరో ఏకాంతంలోకి మనసు ప్రయాణం
పేరుకు మాత్రం పేరు మిగులుతోంది
కాలం ఒక్కరినే భరించగలుగుతోంది
సూర్యచంద్రులు సంశయంతో సంచరిస్తున్నా...
భూమి బంతిలా తిరుగుతోంది
మనిషి మరబొమ్మలా మసలుతున్నాడు
స్వార్థం అసూయ తోబుట్టువులై కలిసి మెలిసి ఉంటున్నాయి.

జీవితం జనన మరణాల కాల చక్రంతో
భారంగా కదులుతూనే ఉంది.



## నీవు నవ్వితే...!

- సహ్యాజ
రాజమండ్రి

నీవు నవ్వితే..
గానంగా సెలయేరో;
దీనంగా చెంగల్వపూవో;
స్పర్శైనట్టుంటాది.

నీవు నవ్వితే..
జారిపోయిన బాల్యమో;
దూరమైన స్వప్నకావ్యమో;
ముద్దాడినట్టుంటాది.

నీవు నవ్వితే
జాలిపడ్డ వెండి జాబిలో;
మూల పడ్డ గుండె లోగిలో;
గుర్తొచ్చినట్టుంటాది.

కాని..
నీవు నవ్వకపోతే...
గుండె గాయమై
మండి గేయమౌతుంది.



## హిమ తారక

### - ఝాన్సీలక్ష్మి కొత్త



శూన్య సుషుప్తిలో మేల్కాంచిన
చైతన్య విహారం
ఆకాశం ప్రిదిలిపోయి
ఆవహించిన ధూమ విలయం
నింగి నుండీ నేలకు
పరచుకున్న హిమకణ సముదాయం
ఒకటొకటిగా తానొకటై
కొనసాగే జీవన నృత్యం
ఓ సుందర దృశ్యం
చుట్టు చుట్టూ తిరిగి
చక్కర్లు కొట్టి
అటు సాగి ఇటు సాగి
అంతలో పై కెగిసి
గాలి తోపుకు వాలి, పైపైకి తేలి
తారుమారై తాను తలక్రిందులై తాను
బంధ విముక్త చిత్తంలా
విశ్వ విలాస చిత్రంలా
సృష్టి స్థితి లయలను
తృటిలో తెలియజేస్తూ
ఒక సత్యాన్ని మోసుకొస్తూ
ఒక నూతనత్వాన్ని ఆవిష్కరిస్తూ
తన శక్తిని ధారవోస్తూ
ధర నొరిగిన
హిమ తరక తారక

## రసరేఖలు

బచ్చోటి శ్రీధర రావు



నవ్వవే నా చెలీ! నయనాల నవ్వు
పలుకవే నా చెలీ! వలపొలుకు పలుకు
పాడవే నా చెలీ పరువాల పాట
సాగవే నా చెలీ సరసాల బాట

అడిగెలే కలహంస నీ నడక సొగసు
అడిగెలే హరిణాలు నేత్రాల కాంతి
అడిగిలే సంజ మబ్బుధరాల వన్నె
అడిగెలే భ్రమరాలు నీలాల సొంపు

కలిసి పాడవే నా తోడ కలిపి గొంతు
కలిసి నడువవే నాతోడ కలిపి యడుగు
కలిసి యాడవే నా తోడ కలిపి పదము
కలిసి మరణింతుమే చెలీ! కలిసి రావె

చూడవే! పిల్చుచున్నవి చుక్క చెలులు
కాంచవే! పిల్చుచున్నది గగనతలము
చాలునే పూడ్చిపెట్టవె సందియములు
పోదమే! గాలిపడవల పుడమి వదిలి

# ఉగాది కవితల పోటీల్లో ప్రోత్సాహక బహుమతి పొందిన కవిత

## ముద్ర

- నాదెళ్ళ అనురాధ



చదువు, కెరీరంటూ నాన్న గీసిన గిరులు
ధిక్కరించనందుకు,
లోకం, 'ప్రయోజకుడ'న్న ముద్రవేసి,
పొంగి పొరలే జీవన భాండాన్ని అందించింది!
ఇప్పుడో,
ఈ అన్ని హోదాల వెనుక, అన్ని పరుగు
పందేల వెనుక,
నిశ్చింతగా పెనవేసుకు నిద్రపోయే భార్యో,
కూతురో,
ఏ నిద్రపట్టని నిశిరాత్రి నిశ్శబ్దమో,
ఏ ఒంటరి సుదూర ప్రయాణమో
నాలోని నన్ను బయటపడేసే యత్నం మొదలెడుతుంది.......
అప్పుడు
అకస్మాత్తుగా మొదలవుతుంది గుండెపట్టని దిగులు!
ఏనాటిదో డైరీపేజీల మధ్య దాచుకున్న తొలికవితా పంక్తులు!
"ఈ పిచ్చి రాతలు కడుపు నింపవ"ని, వీపున చరిచి

తను నమ్మిన జీవిత సత్యాల్ని నాలోకి ఒంపేయత్నంలో
తనే గెల్చిన నాన్న!
భాష ఎరుగని ప్రవాసదేశంలో చదువుకొమ్మంటూ తరిమి కొట్టిన నాన్న!
బిక్కుమనే బెంగతనానికి స్నేహపు పూతరేకులద్ది,
లోకపు గెలుపులకోసం నడక ఆరంభించిన రోజులు!
జీవితం
నేను నేనుగా మాత్రమే ఎప్పటికీ మిగలాలన్న ప్రాకృతిక భావాన్ని,
నా జీవనాభిలాషల్ని దోచుకుని,
నేనేమైపోయానో అర్థంకాని జడత్వాన్ని,
ప్రపంచానికి పనికొచ్చే చైతన్యాన్ని మాత్రం నాలో మిగిల్చింది!

## స్నేహార్ద్రం

- శ్రీరాం కుమార్ భాగవతుల



కనులకు బరువెక్కి
విడచిన కన్నీళ్ళను కూడ...
స్నేహం తన ఒడిలోకి చేరదీస్తుంది
ఆ క్షణం కూడా భారమైన గుండె.
బాధను భరింపలేక
నేస్తమనే నీడలో విడిచిపోతుంది
ఆశ నిరాశగా మారిన
ఆ క్షణం నరకమైతే... అదే క్షణం
నేనున్నానని ఆశను కలిగించి...
తోడుంటానని బాస చేస్తుంది స్నేహం
అందుకే... "నేను" అనేది స్వార్థం
"మనము" అనేది స్నేహం



## "వెన్నెలా - రావా ఇలా!"

- సావి

సాయం సంధ్య వేళ
సన్నగా చిరుజల్లు కురిసి వెలిసింది
బెంచీ పై ఉన్న నాకు
ఎదురుగా వున్న గులాబీ మొక్కలపైని నీటిబిందువులు
ముత్యాల్లా కనబడుతున్నాయి.
పారిజాతం పూలు వీధి నిండా పడి
శ్వేత సంద్రంలా కనబడుతుంది
పారిజాతపూలు సువాసన, మట్టి వాసన
నాలో తెలీని ఉత్సాహాన్ని నింపుతున్నాయి...
ఇంతలో...
నా గుండెలో ఏదో అలజడి
అటు వైపుగా చూసాను
ప్రేమకి నిర్వచనమైన నువ్వు ఇటుగా
వస్తున్నావు
నా ఆరాధ్య దేవతకి నేనేమిచ్చుకోను
నా కళ్ళలో నిండి ఉన్న ప్రేమానురాగాలు తప్ప
నీపై ఉన్న నాలోని అనుభూతులు
ఒక్కసారిగా ఈ పారిజాత సుమహారాలయ్యాయి -
"వెన్నెలా - నా హృదయంలోకి రా ఇలా..."
ఇంకొక క్షణంలో నా పుష్ప సామ్రాజ్యపు అధిపతిగా
వెలుగుతావనుకున్న సమయంలో
భోరున వర్షం
పక్కనే ఉన్న చెట్టు కిందకెళ్ళి
ఆకుల మధ్యలోంచీ పడుతున్న తుంపరను ఆస్వాదిస్తున్నావు పైకి చూస్తూ
పూలన్నీ నీళ్ళలో కలిసి ప్రవహిస్తున్నాయి నీ పాదాలని తాకుతూ
నా మోములో చిరునవ్వు
మదిలో చిరుతలుపు
"వెన్నెలా - ఎన్నడైనా వస్తావా ఇలా?"



# వెన్నెల వెతలు

- చంద్రహాస్

ఆశ్వయుజు కాలం చేసింది
కార్తీకం ఆవరించింది
కాలిక్రింద కాల నిక్షిప్తమైన శక్తి
రాత్రి చీకటిని వెలిగిస్తూంది
ధరణికి జ్వరం ప్రకోపిస్తుంది
నీహారంలో తడిసిన జ్యోత్స్నను
కంబళిలా కప్పుకుంది ప్రకృతి.
కరంటు బాధలు లేని కార్తీకాల్లో
వెన్నెల నీడల్లో ఆ నాటి క్రీడలు
గుర్తు చేసింది గుండె గుబులుగా..
రానున్న తరాల కార్తీక పూర్ణిమ
కాలప్రవాహపు ఆటుపోట్లలో
వరమో శాపమో సంశయంగా
వేసారి పోయింది దిగులుగా

# రసరేఖలు

- బచ్చోటి శ్రీధరరావు

ఇది సుదీర్ఘ విభావరి ఇందులేవు
వెన్నెలల కాంతులీ వినువీధి లేవు
సొగసులొలుకు నొకటి రెండు చుక్కలైన
అన్ని దిక్కులును తమోయమ్ముసుమ్ము



కాటుకవలెనెల్లెడల చీకట్లు గ్రమ్మి
కనులు తెరిచితెరువక నొక్కటి గనుండె
ఇంత నిశ్శబ్దతలమున నీ నిశీథి
పిచ్చియెక్కినట్లె పరువెత్తుచుంటి

దారి కనబడదిన యత్నమ్ము మాన
నూరకే ముందునకు పోవుచుందు నేను
దట్టమైయావరించు సాంధ్యమ్మునందు
దేని వెదుకుదునో నేనె తెలియలేను

గమ్యము తెలియదేమియు కనను గాని
ప్రకృతి యెల్ల నిద్రించునీ రాత్రివేళ
తిరుగునచ్చటచ్చట మిణుగురులు కొన్ని
ఆరిపోయిన గుండెలో నాశలనగ

నాదు ప్రేమ కాదంచునే నాడు వెడిలి
నావొ ఆనాడె నాదు మనస్సు వశము
తప్పినది ఒక్కసారైన దారి తప్పి
యైన రావేమొ మిణుగురులట్లు నీవు!